


సమాజ హితం - మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778




రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 200 పేజీలు : 12, వెల రూ. 5/- శుక్రవారం, సెప్టెంబరు 11, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA

# బీఆర్‌ఎస్ కుట్రలను తిప్పికొట్టండి

## ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

- కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం
- అసెంబ్లీ కార్యకలాపాలను బీఆర్ఎస్ అడ్డుకుంటోందని ఆరోపణ
- అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ అహంకారం వీడలేదని వ్యాఖ్య
- ప్రతిపక్షాల కుట్రలను సమర్థంగా ఎదుర్కోవాలని ఎమ్మెల్యేలకు పిలుపు
- ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన



ప్రతిపక్ష బీఆర్ఎస్ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలని, అదే సమయంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన

(మిగతా 2వ పేజీలో)



## రూ. 200 కోట్ల భూమిని రేవంత్ ఆయన సోదరుడికి కట్టబెట్టాడు: కేటీఆర్

- రేవంత్ రెడ్డి తన 18 గంటల సమయాన్ని ఆయన సోదరుల కోసం కేటాయిస్తున్నారన్న కేటీఆర్
- లక్ష మూలధనం ఉన్న కంపెనీకి రూ. 200 కోట్ల భూమిని కట్టబెట్టారని ఆరోపణ
- ఈ భూ కుంభకోణంపై ఈడీ, సీబీఐలతో కేంద్రం విచారణ జరిపించాలని డిమాండ్



## ఏకంగా సెక్రటేరియట్‌లోనే లంచం.. ఏసీబీ చేతికి చిక్కిన ఉద్యోగి



## తెలంగాణలో కరెంట్ వాడకం ఆల్-టైమ్ రికార్డ్.. రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విద్యుత్ వినియోగం!

- తెలంగాణలో 19,543 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- గతేడాదితో పోలిస్తే 23 శాతం పెరిగిన కరెంట్ వాడకం
- అన్ని రంగాల్లో విద్యుత్ వినియోగం పెరగడమే కారణం

## రేవంత్ రెడ్డిని కలిస్తే తప్పేంటి.. మేమిద్దరం తిట్టుకోవాలని చూస్తున్నారు: రాజగోపాల్ రెడ్డి

- నియోజకవర్గ నిధుల కోసమే సీఎంను కలిశానన్న రాజగోపాల్ రెడ్డి
- రేవంత్ రెడ్డితో అభిప్రాయ భేదాలు సహజమేనని వెల్లడి
- మంత్రి పదవులపై అధిష్ఠానమే నిర్ణయం తీసుకుంటుందని స్పష్టీకరణ
- కొండా సురేఖ విషయంలో సీఎం నిర్ణయంలో తప్పులేదని వ్యాఖ్య
- తాను, సీఎం గొడవపడాలని కొందరు చూస్తున్నారని ఆరోపణ



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తన భేటీపై సాగుతున్న ప్రచారానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెరదించారు. ముఖ్యమంత్రి, తాను ఎప్పుడూ కలహించుకోవాలని కొందరు కోరుకుంటున్నారని ఆయన ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి, నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రిని, ఉప ముఖ్యమంత్రిని కలవడంలో తప్పేముందని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి పనుల నిమిత్తం వారిని కలవడం అనివార్యమని, దీనికి రాజకీయ అర్థాలు ఆపాదించవద్దని కోరారు. ముఖ్యమంత్రితో తనకు అభిప్రాయ భేదాలు ఉన్న మాట వాస్తవమేనని, అయితే అవి

(మిగతా 2వ పేజీలో)



## తుమ్మల పనితీరు, వ్యక్తిత్వంపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు



## ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది: భట్టి

- రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్న భట్టి
- ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల కోసం శ్రీశైలం, సాగర్ తదితర రిజర్వాయర్లను పరిశీలిస్తున్నామని వెల్లడి
- విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరిందన్న డిప్యూటీ సీఎం

## 22ఏ భూములపై చర్చకు డిమాండ్.. మండలిలో రసాభాస.. బీఆర్ఎస్ వాకౌట్

- చైర్మన్ పోడియం వైపు దూసుకెళ్లిన బీఆర్ఎస్ సభ్యులు
- 22ఏ భూములపై చర్చకు అనుమతించకపోవడంతో వాకౌట్ చేసిన సభ్యులు
- మార్షల్స్ వ్యవహరించిన తీరుపై మధుసూదనాచారి మండిపాటు



తెలంగాణ శాసనమండలిలో 22ఏ నిషేధిత భూముల వివాదంపై ఈరోజు తీవ్ర గందరగోళం నెలకొంది. సభ ప్రారంభమైన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ల్యాండ్ రికార్డులు, 22ఏ భూములకు సంబంధించిన సమస్యలపై తక్షణమే పూర్తిస్థాయి చర్చ జరపాలని

(మిగతా 2వ పేజీలో)



## సీఎం సొంత ఊరిలోనే ఈ దుస్థితా?: కేటీఆర్

- విద్యుత్ రంగాన్ని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందన్న కేటీఆర్
- పాతకాలపు కరెంట్ కోతలు పునరావృతమవుతున్నాయని విమర్శ
- రేవంత్ సొంత గ్రామంలోనే రైతులు విద్యుత్ కోతలతో అల్లాడుతున్నారన్న కేటీఆర్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని... కేసీఆర్ హయాంలో లభించిన 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ స్థానంలో మళ్లీ పాతకాలపు కరెంటు కోతలు పునరావృతమవుతున్నాయని

(మిగతా 2వ పేజీలో)

## దుష్ప్రచారాలు నమ్మొద్దు

### గణేశ్ నిమజ్జనాలపై హైడ్రా చీఫ్ రంగనాథ్

- గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదన్న రంగనాథ్
- సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని వెల్లడి
- అన్ని చెరువులు, జలాశయాల్లో నిమజ్జనాలు యథావిధిగా సాగుతాయని స్పష్టీకరణ



అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
www.arunaprabha.com
తెలుగు దినపత్రిక



# తెలంగాణలో కరెంట్ వాడకం ఆల్-టైమ్ రికార్డ్

## రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విద్యుత్ వినియోగం!



తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం సరికొత్త రికార్డు సృష్టించింది. బుధవారం ఉదయం 10:41 గంటలకు రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌ను విజయవంతంగా సరఫరా చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ ఏడాది మార్చి 27న నమోదైన 19,506 మెగావాట్ల రికార్డును కేవలం ఆరు నెలల వ్యవధిలోనే అధిగమించడం గమనార్హం. గతేడాది ఇదే రోజు (2025 సెప్టెంబర్ 9) రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 15,906 మెగావాట్లుగా నమోదైంది. దానితో పోలిస్తే, కేవలం ఏడాది వ్యవధిలోనే డిమాండ్ 23 శాతం పెరిగింది. రాష్ట్రంలో వ్యవసాయ, గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో విద్యుత్ వాడకం గణనీయంగా పెరగడమే ఈ రికార్డు స్థాయి డిమాండ్‌కు ప్రధాన కారణమని అధికారులు విశ్లేషిస్తున్నారు. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ స్థిరంగా పెరుగుతూ వస్తోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 15,497 మెగావాట్లుగా ఉన్న గరిష్ఠ డిమాండ్, 2023–24లో 15,623 మెగావాట్లకు, 2024–25లో 17,162 మెగావాట్లకు పెరిగి, తాజాగా 19,543 మెగావాట్ల మైలురాయిని దాటింది.ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావం వంటి సవాళ్లు ఎదురైనప్పటికీ, రాష్ట్ర విద్యుత్ సంస్థలు ముందుచూపుతో ప్రణాళికలు రచించడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా డిమాండ్‌కు తగినట్లుగా సరఫరాను కొనసాగించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. తక్షణ అవసరాలు, దీర్ఘకాలిక వ్యూహాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన నేడు ఇంధన శాఖపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో భవిష్యత్తులో పెరిగే డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# దుష్ప్రచారాలు నమ్మొద్దు

## గణేశ్ నిమజ్జనాలపై హైడ్రా చీఫ్ రంగనాథ్

**గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదన్న రంగనాథ్**

**సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని వెల్లడి**

**అన్ని చెరువులు, జలాశయాల్లో నిమజ్జనాలు యథావిధిగా సాగుతాయని స్పష్టీకరణ**



హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎటువంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

# తుమ్మల పనితీరు, వ్యక్తిత్వంపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు

### ఇతర పార్టీల వారికి కూడా మంచి చేసే నాయకుడు తుమ్మల అన్న పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి

### తుమ్మల అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారని ప్రశంస

### ఏ సమస్యపై ఫోన్ చేసినా వెంటనే స్పందిస్తారని కితాబు



కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలు అందిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేసే నాయకుడిని, వారి నిబద్ధతను గుర్తించి మెచ్చుకోవడంలో తప్పులేదని వారు స్పష్టం చేశారు. "మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు" అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని... ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా, వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు. ప్రజలు లేదా నియోజకవర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎంతో ఓపికతో విని, ఆ సమస్య పూర్తయ్యే వరకు అధికారులతో స్వయంగా మాట్లాడతారని పేర్కొన్నారు. పని ఏ దశలో ఉందో, ఎప్పుడు పరిష్కారమవుతుందో కూడా మళ్లీ తిరిగి ఫోన్ చేసి అప్‌డేట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాలనా సమర్థతను, ఓపికను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు సూచించారు.

# రూ. 200 కోట్ల భూమిని రేవంత్ రెడ్డి ఆయన సోదరుడికి కట్టబెట్టాడు: కేటీఆర్

**రేవంత్ రెడ్డి తన 18 గంటల సమయాన్ని ఆయన సోదరుల కోసం కేటాయిస్తున్నారన్న కేటీఆర్**

**లక్ష మూలధనం ఉన్న కంపెనీకి రూ. 200 కోట్ల భూమిని కట్టబెట్టారని ఆరోపణ**

**ఈ భూ కుంభకోణంపై ఈడీ, సీబీఐలతో కేంద్రం విచారణ జరిపించాలని డిమాండ్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని, ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆ వివాదాస్పద భూ కేటాయింపు స్థలాన్ని ఈరోజు ఆయన సందర్శించిన పర్యవేక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని నిత్యం చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఆ సమయాన్నంతా తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన సొంత సోదరులు, బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమే కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేవలం రూ. లక్ష మూలధనంతో నడిచే కంపెనీకి ఐదెకరాల విలువైన భూమిని ఎలా కేటాయిస్తారని కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎవరైనా కేవలం లక్ష రూపాయలతో స్టార్టప్ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వందల కోట్ల విలువైన భూములు ఇస్తుందా..? అని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇజ్రాయెల్ వ్యాపార భాగస్వామ్యాలపై ప్రధాని మోదీని ప్రశ్నిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేవంత్ రెడ్డి సోదరుడి కోసం 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్' సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో భూములు కొల్లగొడుతోందని ఆరోపించారు. నెలకు రూ.4,000 పింఛన్, మహిళలకు రూ.2,500, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలకు మొండిచేయి చూపించిన కాంగ్రెస్, సీఎం సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి, వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఈ భారీ భూ కుంభకోణంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే తక్షణమే ప్రవర్తన, పత్రాలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఏకంగా సెక్రటేరియట్‌లోనే లంచం.. ఏసీబీ చేతికి చిక్కిన ఉద్యోగి

**సచివాలయంలో రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఉద్యోగి**

**సీఎంఆర్‌ఎఫ్ చెక్కు కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు**

**బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి ఏసీబీ అధికారులు**

**సచివాలయ దేవాలయం వద్ద డబ్బులు తీసుకుంటుండగా పట్టివేత**

**లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు**



తెలంగాణ సచివాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) సెక్షన్‌లో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. రూ.2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు ఇచ్చేందుకు బాధితుడి నుంచి రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీఎంఆర్‌ఎఫ్ చెక్కు కోసం లంచం అడగడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. గురువారం సచివాలయ ప్రాంగణంలో నిఘా ఏర్పాటు చేశారు. సచివాలయంలోని దేవాలయం వద్ద బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ.లక్ష లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత సీఎంఆర్‌ఎఫ్ సెక్షన్‌లోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేయడం వెనుక మరికొందరి పాత్ర ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో రెగ్యులర్ అధికారుల ప్రమేయం ఉందా? అన్నదీ ఏసీబీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి

కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో ఈ మేరకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అయితే, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభా కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ నేతల్లో అహంకారం తగ్గలేదని ఆయన వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సభ్యులు పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించడమే కాకుండా, మహిళా అధికారుల ముందే టీ-షర్టులు తీసి అసభ్యంగా ప్రవర్తించారని ముఖ్యమంత్రి ఆరోపించారు. స్పీకర్‌పై అత్యంత అభ్యంతరకర భాషను ఉపయోగిస్తూ, సభా కార్యక్రమాలకు విఘాతం కలిగించారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వంపై జరుగుతున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని ఈ సందర్భంగా సీఎం అభినందించారు. ప్రతిపక్షాల కుతంత్రాలను బలంగా తిప్పికొట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలందరూ తప్పనిసరిగా అసెంబ్లీకి హాజరై, చర్చల్లో చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సూచించారు.

# రేవంత్ రెడ్డిని కలిస్తే తప్పేంటి.. మేమిద్దరం తిట్టుకోవాలని చూస్తున్నారు: రాజగోపాల్‌రెడ్డి

సహజమైనవని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి పదవి కోసం తాను ముఖ్యమంత్రికి లొంగిపోయినట్లు కొందరు, ఇద్దరి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయని మరికొందరు చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. "ముఖ్యమంత్రిని కలిస్తే లొంగిపోయినట్లు, కలవకపోతే దూరం పెరిగినట్లు రకరకాలుగా ప్రచారం చేస్తున్నారు. నేను, సీఎం ఘర్షణ పడాలని కొందరు ఆశిస్తున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి పదవుల విస్తరణ అంశం పూర్తిగా పార్టీ అధిష్ఠానం పరిధిలోనిదని, గతంలో తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ లభించినట్లు రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు. అధిష్ఠానం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. కొండా సురేఖ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరించిన తీరులో ఎలాంటి తప్పు లేదని, ఆయన అధిష్ఠానానికి సరైన సమాచారాన్నే అందించారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భిన్నమైన అభిప్రాయాలు ఉండటం సహజమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సాయం స్వల్ప మొత్తమేమీ కాదని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.



# 22ఏ భూములపై చర్చకు డిమాండ్.. మండలిలో రసాభాస.. బీఆర్ఎస్ వాకౌట్

డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ సభ్యులు వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. అయితే మండలి చైర్మన్ ఈ వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తూ, ముందస్తు ఎజెండా ప్రకారం ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. చైర్మన్ నిర్ణయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు పోడియం వైపు దూసుకెళ్లి నినాదాలు చేయడంతో సభలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో సభను సజావుగా సాగనివ్వాలని, ప్రజా సమస్యలపై చర్చించేందుకు సభ్యులు తమ స్థానాల్లో కూర్చుని సహకరించాలని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేసినప్పటికీ బీఆర్ఎస్ నేతలు శాంతించలేదు. ప్రభుత్వం చర్చకు భయపడుతోందని ఆరోపిస్తూ సభ జరుగుతున్న తీరుకు నిరసనగా బీఆర్ఎస్ సభ్యులందరూ మండలి నుంచి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. వాకౌట్ అనంతరం మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మీడియాతో మాట్లాడుతూ... శాసనమండలి ప్రాంగణంలో ప్రతిపక్ష సభ్యుల పట్ల మార్షల్స్ ప్రవర్తించిన తీరును తప్పుబట్టారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధుల హక్కులను భంగపరిచేలా మార్షల్స్ వ్యవహరించడం శోచనీయమని ఆయన మండిపడ్డారు.

# సీఎం సొంత ఊరిలోనే ఈ దుస్థితా?: కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లికి చెందిన రైతులు తమ కష్టాలను వెళ్లబోసుకుంటున్న వీడియోను సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో పంచుకుంటూ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి వచ్చిన అసలైన మార్పు ఇదేనా?" అని కేటీఆర్ తన పోస్టులో ప్రశ్నించారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి పాలమూరు జిల్లాలో, ఆయన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనే రైతులు విద్యుత్ కోతలతో విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడా వోల్టేజ్, సమయానికి కరెంటు రాకపోవడంతో పొలాలకు నీళ్లు పారక పంటలు ఎండిపోతున్నాయని, విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయని అన్నారు.

# ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది: భట్టి విక్రమార్క

### రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్న భట్టి

తెలంగాణలో పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల' ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను దీనికోసం సమగ్రంగా పరిశీలిస్తున్నాయని చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధిక వ్యయం కావడం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు/సుంకాల వల్ల ఒక్క మెగావాట్ ప్రాజెక్టుపై దాదాపు రూ. 1.30 కోట్ల మేర అదనపు భారం పడుతోందని, ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రానికి సోలార్ విభాగంలో పెట్టుబడులు భారీగా వెల్లువెత్తుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఏకంగా 19,000 మెగావాట్లకు చేరిందని తెలిపారు. పేదలు, రైతుల విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం ఏటా రూ. 19,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో ఉచిత సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి ప్రకటించారు. అమ్రాబాద్ పరిధిలోని 80 గ్రామాలను పూర్తిస్థాయిలో సోలరైజ్ చేసేందుకు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామని, అక్కడ స్వతంత్ర 'మైక్రో గ్రిడ్లు' నిర్మించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. సాధారణ రైతులు, ప్రజలు తమ ఇళ్లు, పొలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

# హామీలు కాదు.. పాలనలో ఫలితాలే ముఖ్యం!

**తెలంగాణ రాజకీయాల్లో ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ హామీల వర్షం కురుస్తుంది. ప్రతి పార్టీ ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేస్తుంది. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడానికి ప్రయత్నాలు మొదలవుతాయి. అయితే ప్రజలు ఇప్పుడు హామీలను వినడానికే పరిమితం కావడం లేదు. వాటి అమలు ఎంతవరకు జరిగిందో ప్రశ్నిస్తున్నారు. ఇదే ప్రజాస్వామ్యంలో వచ్చిన ఆరోగ్యకరమైన మార్పు.**



ప్రజలకు సంక్షేమ పథకాలు అవసరమే. పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, రైతులకు భరోసా, మహిళలకు చేయూత, యువతకు ఉపాధి, విద్యార్థులకు అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. కానీ సంక్షేమం పేరుతో నిరంతరం ఖర్చు పెంచుతూ, ఆదాయ వనరులను పెంచకపోతే భవిష్యత్తులో ఆ భారాన్ని ప్రజలే మోయాల్సి వస్తుంది. అందుకే సంక్షేమం, అభివృద్ధి రెండూ సమతూకంగా సాగాలి.

**తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రం అనేక రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందింది. హైదరాబాద్ దేశంలోనే ప్రముఖ నగరంగా ఎదిగింది. పరిశ్రమలు, సమాచార సాంకేతిక రంగం, ఔషధ పరిశ్రమ, సేవారంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలంగా నిలిచాయి. అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో కూడా మౌలిక వసతులు మెరుగుపడాల్సిన అవసరం ఉంది. నగర అభివృద్ధితో పాటు పల్లెల అభివృద్ధి కూడా సమానంగా సాగాలి.**

**ప్రభుత్వాలు మారినప్పుడల్లా గత ప్రభుత్వ నిర్ణయాలపై విమర్శలు చేయడం రాజకీయాల్లో సాధారణంగా మారింది. తప్పులు జరిగితే సరిదిద్దడం అవసరం. అవకతవకలు ఉంటే విచారణ జరపాలి. కానీ పాలన మొత్తం గతాన్ని విమర్శించడానికే పరిమితమైతే ప్రజలకు ప్రయోజనం ఉండదు. గతాన్ని సమీక్షించడంతో పాటు భవిష్యత్తు కోసం స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలి. ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే యువతకు పరిష్కారం కావు. పరిశ్రమలు రావాలి. చిన్న వ్యాపారాలు పెరగాలి. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు విస్తరించాలి. నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. చదువుకున్న యువత ఉద్యోగం కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గాలి. రాజకీయ పార్టీలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. ఎన్నికల సమయంలో ప్రజలకు సాధ్యమైన హామీలనే ఇవ్వాలి. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుకు కాలపరిమితి ప్రకటించాలి. ప్రజలు అడిగే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి. పారదర్శకత పెరిగితే ప్రభుత్వంపై విశ్వాసం కూడా పెరుగుతుంది. తెలంగాణ ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులు. ఎవరు ఏం చెప్పారు అన్నదానికంటే ఎవరు ఏం చేశారు అన్నదే వారు గమనిస్తున్నారు. అందుకే ఇకపై రాజకీయ నాయకత్వానికి అసలు పరీక్ష హామీల్లో కాదు.. ఆ హామీలను ప్రజల జీవితాల్లో మార్పుగా చూపించడంలోనే ఉంది.**



-గుర్రం పాపిరెడ్డి
ఎడిటర్



## హైదరాబాద్.. అభివృద్ధికి హద్దులు ఎక్కడ?

**హైదరాబాద్ వేగంగా విస్తరిస్తోంది. ఒకప్పుడు నగరంగా ఉన్న ప్రాంతాలు ఇప్పుడు మహానగర రూపాన్ని సంతరించుకున్నాయి. శివారు ప్రాంతాల్లో భారీ నిర్మాణాలు జరుగుతున్నాయి. కొత్త రహదారులు, వాణిజ్య సముదాయాలు, నివాస ప్రాంతాలు ఏర్పడుతున్నాయి. నగరానికి పెట్టుబడులు రావడం, ఉద్యోగాలు పెరగడం సంతోషించాల్సిన విషయమే. కానీ ఈ అభివృద్ధికి తగిన ప్రణాళిక లేకపోతే అదే నగర జీవనానికి భారంగా మారే ప్రమాదం ఉంది.హైదరాబాద్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ట్రాఫిక్ ఒకటి. రహదారుల విస్తరణ జరుగుతున్నా వాహనాల సంఖ్య మరింత వేగంగా పెరుగుతోంది. ప్రజా రవాణాను బలోపేతం చేయకుండా కేవలం రహదారులను విస్తరించడం శాశ్వత పరిష్కారం కాదు. నగరంలోని ప్రతి ప్రాంతాన్ని మెరుగైన ప్రజా రవాణాతో అనుసంధానం చేయాలి.**

వర్షం పడితే కొన్ని ప్రాంతాల్లో నీరు నిలవడం మరో ప్రధాన సమస్య. చెరువులు, నాలాలు, సహజ నీటి ప్రవాహ మార్గాలు ఆక్రమణలకు గురైతే భారీ వర్షాల సమయంలో నగరానికి ముప్పు తప్పదు. నగరాభివృద్ధి అంటే కేవలం భవనాలు నిర్మించడం కాదు. ప్రకృతితో సమన్వయం చేసుకుంటూ నగరాన్ని విస్తరించడం.

చెట్ల తొలగింపు, ఖాళీ స్థలాల కొరత, చెరువుల క్షీణత వంటి అంశాలను కూడా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా చూడాలి. భవిష్యత్తులో హైదరాబాద్ జనాభా మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటి నుంచే తగిన ప్రణాళికలు రూపొందించకపోతే సమస్యలు మరింత తీవ్రమవుతాయి.

**మరోవైపు నగరంలోని పాత ప్రాంతాల అభివృద్ధిపై కూడా దృష్టి పెట్టాలి. కొత్త శివారు ప్రాంతాల్లో భారీ ప్రాజెక్టులు వస్తున్నా పాతబస్తీలు, మధ్య నగర ప్రాంతాల్లో మౌలిక వసతులు వెనుకబడకూడదు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు వంటి మౌలిక సదుపాయాలు ప్రతి పౌరుడికి అందాలి. నగర ప్రణాళికలో ప్రజల భాగస్వామ్యం కూడా అవసరం. ఒక ప్రాంతంలో భారీ నిర్మాణం చేపట్టే ముందు అక్కడి రహదారుల సామర్థ్యం, నీటి లభ్యత, పౌరుదల వ్యవస్థ, పర్యావరణ ప్రభావం వంటి అంశాలను పరిశీలించాలి.**

హైదరాబాద్ కేవలం తెలంగాణ రాజధాని మాత్రమే కాదు. దేశంలోని ప్రముఖ ఆర్థిక కేంద్రాల్లో ఒకటి. ఇక్కడి అభివృద్ధి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకం. అందుకే రాజకీయ నిర్ణయాలు తాత్కాలిక ప్రయోజనాల కోసం కాకుండా కనీసం మరో రెండు మూడు దశాబ్దాలను దృష్టిలో పెట్టుకుని ఉండాలి. ఎత్తైన భవనాలతో మహానగరం తయారవదు. ప్రజలకు సౌకర్యవంతమైన జీవితం, స్వచ్ఛమైన గాలి, సురక్షితమైన రహదారులు, సమర్థమైన రవాణా, నీటి భద్రత ఉన్నప్పుడే హైదరాబాద్ నిజమైన ప్రపంచస్థాయి నగరంగా నిలుస్తుంది.

## రైతు బాగుంటేనే తెలంగాణ బాగుంటుంది



తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం ఇప్పటికీ కీలకమైన రంగం. గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది కుటుంబాల జీవనం వ్యవసాయంపైనే ఆధారపడి ఉంది. ప్రభుత్వం ఎన్ని సంక్షేమ పథకాలు తీసుకొచ్చినా రైతు పంటకు సరైన ధర లభించకపోతే అతని సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. రైతుకు మొదటి అవసరం సాగునీరు. రెండోది నాణ్యమైన విత్తనాలు, ఎరువులు. మూడోది పంటకు గిట్టుబాటు ధర. నాలుగోది మార్కెట్ భద్రత. ఈ నాలుగు అంశాల్లో ఏ ఒక్కటి బలహీనపడినా రైతు ఆదాయంపై ప్రభావం పడుతుంది. వాతావరణ మార్పులు వ్యవసాయానికి కొత్త సవాళ్లు తెస్తున్నాయి. ఒకే సీజన్‌లో అధిక వర్షాలు, వర్షాభావ పరిస్థితులు రెండూ కనిపిస్తున్నాయి. పంటల ఎంపిక నుంచి నీటి వినియోగం వరకు రైతులకు శాస్త్రీయ సలహాలు అందించాల్సిన అవసరం ఉంది. వ్యవసాయాన్ని కేవలం పంటల సాగుగా చూడటం కూడా సరైన విధానం కాదు. పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకం, కోళ్ల పెంపకం, చేపల పెంపకం, పండ్ల తోటలు వంటి అనుబంధ రంగాలను ప్రోత్సహిస్తే రైతు ఆదాయం పెరగవచ్చు. రైతు పండించిన పంటకు మార్కెట్ లభించకపోవడం తరచూ కనిపించే సమస్య. పంట పండించిన తర్వాత నిల్వ సదుపాయాలు లేక రైతు తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో శీతల గిడ్డంగులు, నిల్వ కేంద్రాలు, ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే రైతుకు విలువ పెరుగుతుంది. మరో ముఖ్యమైన అంశం రైతు కుటుంబాల యువత. వ్యవసాయం ద్వారా భవిష్యత్తు లేదనే భావనతో చాలామంది యువత నగరాల వైపు వెళు తున్నారు. వ్యవసాయాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేసి లాభదాయకమైన వృత్తిగా మార్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. రైతు రుణభారం కూడా నిర్లక్ష్యం చేయలేని సమస్య. పంట నష్టపోయినప్పుడు రైతుకు తక్షణ సహాయం అందాలి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పరిహారం ఆలస్యం కాకూడదు. రైతు సమస్యలపై రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో మాత్రమే మాట్లాడకూడదు. వ్యవసాయ రంగానికి దీర్ఘకాలిక విధానం అవసరం. ప్రభుత్వం మారినా రైతు విధానాలు పూర్తిగా మారిపోకుండా స్థిరమైన వ్యవస్థ ఉండాలి. తెలంగాణ భవిష్యత్తులో పరిశ్రమలు, సమాచార సాంకేతిక రంగం, సేవారంగం ఎంత ముఖ్యమో వ్యవసాయం కూడా అంతే ముఖ్యం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడితేనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. రైతుకు సాయం చేయడం అంటే కేవలం నగదు ఇవ్వడం కాదు. అతను పండించిన పంటకు గౌరవం, సరైన ధర, మార్కెట్, నీరు, సాంకేతిక పరిజ్ఞానం కల్పించడమే నిజమైన రైతు సంక్షేమం.

# రాజకీయ పోటీ ఉండాలి.. శత్రుత్వం కాదు

**తెలంగాణ రాజకీయాల్లో మాటల దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అధికార పక్షం, ప్రతిపక్షం మధ్య విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమే. కానీ వ్యక్తిగత దూషణలు, కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగడం, పరస్పరం అవమానకర వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య సంస్కృతికి మంచిది కాదు. ప్రజాస్వామ్యంలో అధికార పార్టీని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షానికి ఉంది. అదే సమయంలో ప్రభుత్వం తన నిర్ణయాలను ప్రజలకు వివరించే బాధ్యత కలిగి ఉంటుంది. విమర్శలను శత్రుత్వంగా చూడకూడదు. ప్రతిపక్షం కూడా ప్రతి నిర్ణయాన్ని వ్యతిరేకించడమే లక్ష్యంగా పెట్టుకోకుండా ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి.**

తెలంగాణ రాజకీయాల్లో గత కొన్నేళ్లుగా వ్యక్తుల చుట్టూ రాజకీయ చర్చ ఎక్కువగా తిరుగుతోంది. ఒక నాయకుడు ఏమన్నారు? మరొక నాయకుడు ఎలా స్పందించారు? అనే అంశాలకే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. కానీ ప్రజలకు అవసరమైన ప్రశ్నలు మాత్రం వెనుకబడుతున్నాయి. ఉద్యోగాల పరిస్థితి ఏమిటి? ప్రభుత్వ పాఠశాలలు ఎలా ఉన్నాయి? ఆసుపత్రుల్లో వైద్య సేవలు ఎలా ఉన్నాయి? రైతుకు పంట ధర ఎలా ఉంది? మహిళలకు భద్రత ఎలా ఉంది? నగరాల్లో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం ఏమిటి? గ్రామాల్లో తాగునీటి పరిస్థితి ఎలా ఉంది? ఇవే అసలు రాజకీయ ప్రశ్నలు కావాలి.

**మీడియా కూడా తన బాధ్యతను గుర్తించాలి. రాజకీయ నాయకుల పరస్పర ఆరోపణలకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రజా సమస్యలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే ప్రతి వ్యాఖ్య వార్త కాదు. వాస్తవ నిర్ధారణకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజలు కూడా రాజకీయ చర్చల్లో బాధ్యతగా వ్యవహరించాలి. సామాజిక మాధ్యమాల్లో ఆధారాలు లేని ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు ప్రచారం చేయడం వల్ల సమాజంలో విభేదాలు పెరుగుతాయి. రాజకీయ అభిప్రాయాలు వేరు కావచ్చు. కానీ మనుషుల మధ్య సంబంధాలు శత్రుత్వంగా మారకూడదు.**

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఒక దశ మాత్రమే. ఎన్నికల తర్వాత పాలన, ప్రజల సమస్యలు, అభివృద్ధి అంశాలపై దృష్టి పెట్టాలి. అధికారంలో ఉన్నవారు శాశ్వతంగా అధికారంలో ఉండరు. ప్రతిపక్షంలో ఉన్నవారు కూడా ఎప్పటికైనా అధికారంలోకి రావచ్చు. అందుకే రాజకీయాల్లో పరస్పర గౌరవం అవసరం. తెలంగాణ సమాజం ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చూసింది. ప్రజల ఆకాంక్షలతో ఏర్పడిన రాష్ట్రంలో రాజకీయాలు మరింత పరిపక్వంగా ఉండాల్సిన అవసరం ఉంది. భిన్నాభిప్రాయాలు ఉండాలి. తీవ్రంగా విమర్శించుకోవచ్చు. కానీ ప్రజాస్వామ్య గీత దాటకూడదు.

**రాజకీయ ప్రత్యర్థి అంటే శత్రువు కాదు. రేపటి ప్రజాస్వామ్య భాగస్వామి. అధికార మార్పు సహజ ప్రక్రియ. కానీ రాజకీయ సంస్కృతి దెబ్బతింటే దాని నష్టం ఒక్క పార్టీకి కాదు.. మొత్తం సమాజానికే.**



# కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు..
# ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

### ఎమ్మెల్యేపై పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు



అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండలం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్‌పై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. అభ్యంతరకర వ్యాఖ్యలను పోలీసులు సుమోటోగా స్వీకరించి, సంబంధిత ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాలకుర్తి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ పాలకుర్తి మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని వారు పేర్కొన్నారు. రాజకీయ విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ, వ్యక్తిగతంగా కించపరిచేలా అభ్యంతరకరంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు బాధ్యతాయుతమైన భాషను ఉపయోగించాలని సూచించారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలపై పోలీసులు సమగ్రంగా పరిశీలించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. చట్టాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే రాజకీయాలకు అతీతంగా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు,జిసిసి మాజీ చైర్మన్ గాంధీ నాయక్, ఎఫ్ ఎస్ సి ఎస్ చైర్మన్ బొబ్బల అశోక్ రెడ్డి, జిల్లా నాయకులు మహేందర్ నాయక్, మండల నాయకులు వీరమనేని సోమేశ్వర్ రావు, ఎల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి, పాము శ్రీను,మండల నాయకులు కడుదూల కర్ణాకర్ రెడ్డి, పాలకుర్తి గ్రామ ఉపసర్పంచ్ గాదపక కిరణ్,కారుపోతుల వేణు గౌడ్, అంజయ్య, వెంకటయ్య, కత్తి సైదులు, కోలా నారాయణ గౌడ్, కందుకూరి రాజేంద్ర చారి బి ఆర్ ఎస్ కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యే వ్యాఖ్యలపై తమ నిరసనను వ్యక్తం చేశారు.

# వాహనం అమ్మారా.. ఆర్టీఏ రికార్డుల్లో యాజమాన్య బదిలీ తప్పనిసరి!

### వాహనం అమ్మిన తర్వాత
### ట్రాన్స్‌ఫర్ చేయించుకోకపోతే చట్టపరమైన ఇబ్బందులు తప్పవు



అరుణప్రభ 10 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా వాహన యజమానులు తమ వాహనాలను ఇతరులకు విక్రయించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ సూచించారు. వాహనం విక్రయించిన తర్వాత కేవలం తెల్లకాగితంపై అగ్రిమెంట్ చేసుకోవడం మాత్రమే కాకుండా, సంబంధిత ఆర్టీఏ కార్యాలయంలో యాజమాన్య బదిలీ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని తెలిపారు. ఇటీవల (గౌతమ్) పేరు మార్చాము అనే వ్యక్తి ఆటోను ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేసి, కొంతకాలం తర్వాత ఈఎంఐలు చెల్లించలేక మరో వ్యక్తికి విక్రయించాడు. అయితే వాహనం విక్రయించే సమయంలో కేవలం తెల్లకాగితంపై అగ్రిమెంట్ చేసుకున్నారు. వాహనం ఆర్టీఏ రికార్డుల్లో మాత్రం గౌతమ్ పేరుమీదే కొనసాగింది. తర్వాత ఆ ఆటోలో గంజాయి తరలిస్తుండగా భద్రాచలంలో పోలీసులు పట్టుకున్నారు. ఆర్టీఏ రికార్డుల ప్రకారం వాహనం యజమాని గౌతమ్ పేరుమీద ఉండటంతో ఆయన పోలీసు కేసుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. మరోవైపు వాహనం ఫైనాన్స్‌లో ఉండటంతో పెండింగ్‌లో ఉన్న ఈఎంఐలు చెల్లించాలంటూ ఫైనాన్స్ సంస్థ నుంచి కూడా ఒత్తిడి ఎదురైంది. ఈ ఘటన వాహనం విక్రయించే ప్రతి ఒక్కరికీ ఒక హెచ్చరిక వంటిదని శంకర్ నాయక్ పేర్కొన్నారు. వాహనం అమ్మిన తర్వాత కొనుగోలుదారుడి పేరుమీద యాజమాన్య బదిలీ జరిగిందా లేదా అనే విషయాన్ని విక్రయించిన వ్యక్తి స్వయంగా నిర్ధారించుకోవాలని సూచించారు. వాహనం కొనుగోలు చేసిన వ్యక్తి ప్రమాదానికి గురిచేసినా, నిబంధనలకు విరుద్ధంగా ఉపయోగించినా లేదా ఇతర చట్టపరమైన సమస్యల్లో చిక్కుకున్నా, ఆర్టీఏ రికార్డుల్లో వాహనం పాత యజమాని పేరుమీదే ఉంటే సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు.

**వాహన యజమానులకు విజ్ఞప్తి**

వాహనాన్ని ఎవరికైనా విక్రయించినప్పుడు కేవలం అగ్రిమెంట్ చేసుకోవడం లేదా డబ్బు తీసుకోవడంతో బాధ్యత పూర్తయిందని భావించకుండా, సంబంధిత ఆర్టీఏ కార్యాలయంలో యాజమాన్య బదిలీ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలి. రికార్డుల్లో కొత్త యజమాని పేరు నమోదైనట్లు నిర్ధారించుకున్న తర్వాతే విక్రయ ప్రక్రియ పూర్తయిందని భావించాలని శంకర్ నాయక్ సూచించారు.

# ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కిషన్ నాయక్‌కు ఘన సన్మానం





అరుణప్రభ 10 సెప్టెంబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఇటీవల నియమితులైన గుగులోతు కిషన్ నాయక్‌కు కొత్తూరు(సి) గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు ఘనంగా సన్మానం చేశారు. ఉపసర్పంచ్ పగడాల క్రిష్ణా రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కిషన్ నాయక్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా కిషన్ నాయక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే, సంబంధిత అధికారులతో పాటు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీల హక్కులు, సంక్షేమం కోసం తన వంతు బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు. అలాగే గ్రామ అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. గ్రామంలోని సమస్యలను గుర్తించి ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తుల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, జీపీఓ వీరస్వామి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్, ఉపాధ్యాయులు వీరన్న, రేషన్ డీలర్ మలిశెట్టి సత్యనారాయణ, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మలిశెట్టి వేణు,అశా కార్యకర్త బోమ్మగాని శైలజ. గుజిలితండ అంగన్వాడీ టీచర్ జాటోతు ద్రౌపథి.బాదావతు సిరినాయక్.కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి మేఘన, వార్డు సభ్యులు జాటోత్ సుజాత శంకర్, చిట్టూరి లక్ష్మీనారాయణ,దయ్యాల బాబు.డాక్టర్ యాఖుబ్, మలిశెట్టి సంపత్. జాటోత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మగ్గమే అర్హతగా
# చేనేత గుర్తింపు కార్డులు ఇవ్వాలి



ధర్మవరం, సెప్టెంబరు 10; (అరుణ ప్రభ న్యూస్) : మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి ఎలాంటి షరతులు లేకుండా చేనేత గుర్తింపు కార్డు మంజూరు చేయాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు చేనేత కార్మికులతో కలిసి మార్కెట్‌యార్డులోని చేనేత సహాయ సంచాలకుడు అప్పాజీకి వినతిపత్రం అందజేశారు. చేనేత మగ్గాన్ని మాత్రమే అర్హతగా పరిగణించి ఎన్టీఆర్ భరోసా చేనేత పింఛన్ లబ్ధిదారులను గుర్తించాలని కోరారు. పింఛన్ల నమోదు గడువు సమీపిస్తున్నందున పట్టణంలోని 40 వార్డుల్లో అర్హులైన చేనేత కార్మికులను త్వరితగతిన గుర్తించి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చేనేత గుర్తింపు కార్డుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని సహాయ సంచాలకుడు అప్పాజీ హామీ ఇచ్చారు.



# చేనేత పింఛన్
# నిబంధనలు సరళీకరించాలి

ధర్మవరం, సెప్టెంబరు 10; (అరుణ ప్రభ న్యూస్) : అర్హులైన చేనేత కార్మికులకు పింఛన్ మంజూరులో ప్రభుత్వం విధించిన నిబంధనలను సరళీకరించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు చేనేత అధికారి అప్పాజీకి సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ జేవీ రమణ, జిల్లా నాయకులు ఎస్‌హెచ్ భాష మాట్లాడుతూ పింఛన్ కోసం కార్మికుల నుంచి పని దినాలు, సిల్క్‌హౌస్ యజమానుల జీఎస్టీ బిల్లులు, రెండేళ్ల బ్యాంకు లావాదేవీలు, వార్పు, రేషం తదితర వివరాలు కోరడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అర్హతను పరిశీలించడంలో అభ్యంతరం లేదని, అయితే సాధ్యంకాని నిబంధనలను తొలగించి అర్హులైన ప్రతి కార్మికుడికి పింఛన్ అందించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలను తాము అమలు చేయాల్సి ఉంటుందని చేనేత అధికారి అప్పాజీ తెలిపారు. కార్మిక సంఘం డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గుంపు హరి, ఏ.ఖాదర్ బాషా, వి.వెంకటస్వామి, అన్నం సూరి, ప్రకాష్, శ్రీనివాసులు, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.



## భగవంతుని కృప లేనిదే ఆయన సన్నిధి చేరలేం
## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి
## ఉమ్రా యాత్రకు బయలుదేరిన 52 మంది బృందం

అరుణ ప్రభ – శంషాబాద్ జోన్: భగవంతుని కృప లేనిదే ఆయన సన్నిధిని చేరలేమని ఇస్లామిక్ మత పెద్దలు అన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఉమ్రా యాత్రకు బయలుదేరిన సందర్భంగా వారు మాట్లాడుతూ మక్కా, మదీనాలను దర్శించుకోవడం ఎంతో పవిత్రమైనదని, ఆ భాగ్యం భగవంతుని కృపతోనే లభిస్తుందని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి సౌదీ ఎయిర్‌లైన్స్ విమానంలో 52 మంది సభ్యులతో కూడిన ఉమ్రా బృందం బయలుదేరింది. ఈ బృందంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన డాక్టర్లు, ఇంజినీర్లు, వ్యాపారులు, ఉద్యోగులు ఉన్నారు. ఉమ్రా యాత్రలో 15 రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు యాత్రికులు తెలిపారు. యాత్రికులకు అవసరమైన ప్రత్యేక వసతులను మహమ్మద్ ఫయాజ్ అలీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్రా యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని మహమ్మద్ ఫయాజ్ తెలిపారు. యాత్ర సజావుగా సాగేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు.ం



## చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు

అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండల కేంద్రంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు వీరనారి చిట్యాల ఐలమ్మ 41 వ వర్ధంతి వేడుకలు పాలకుర్తి చౌరస్తా లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి ఇంటి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ సయుధా పోరాటంలో భూస్వామ్య వ్యవస్థకు రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఎదురొడ్డి నిలిచిన చాకలి ఐలమ్మ స్తుతులను స్మూతులను గౌరవిస్తూ నాటి ఉద్యమంలో ఆమె చూపిన ధైర్యం నేటికీ పూర్తిదాయకం ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాలు చిట్యాల శ్వేత సంపత్, కాంగ్రెస్ పార్టీ ఆత్మ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు. మార్కెట్ చైర్మన్ లావుడియా మంజుల భాస్కర్. జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎండి మదర్, సీనియర్ నాయకులు పెనుగొండ రమేష్, కమ్మగాని నాగన్న గౌడ్, ఎండి సలీం ,పన్నీరూ వెంకన్న, చిలువేరు కృష్ణమూర్తి ,గాదపాక ఎల్లయ్య, ఆకుల నాగరాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు ఎన్‌బీఏ గుర్తింపు పొడిగింపు



ధర్మవరం, సెప్టెంబరు 10; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని అన్ని కోర్సులకు జాతీయ ప్రమాణాల గుర్తింపు మండలి (ఎన్‌బీఏ) గుర్తింపును 2029 డిసెంబరు 31 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు తెలిపారు. గతంలో ఉన్న ఎన్‌బీఏ గుర్తింపు 2026 జూన్‌తో ముగియనున్న నేపథ్యంలో పునరుద్ధరణ కోసం కళాశాల తరఫున దరఖాస్తు చేశారు. దీనిలో భాగంగా ఢిల్లీ నుంచి వచ్చిన ఉన్నతాధికారుల బృందం జూన్ 28న కళాశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న వసతులు, ప్రయోగశాలలు, బోధనా ప్రమాణాలు, సంబంధిత రికార్డులు, దస్త్రాలను పరిశీలించింది. కళాశాలలోని వసతులు, నిర్వహణపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేయడంతో ఎన్‌బీఏ గుర్తింపును 2029 డిసెంబరు 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. గుర్తింపు పొడిగింపునకు కృషి చేసిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు ప్రిన్సిపాల్ సురేష్ బాబు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.



# రీసర్వేలో తప్పిదాలకు
# తావులేకుండా చూడాలి

ధర్మవరం, సెప్టెంబరు 10; (అరుణ ప్రభ న్యూస్) ధర్మవరం డివిజన్‌లోని కుంటూరు, కనుముక్కల, మేడాపురం గ్రామాల్లో కొనసాగుతున్న భూముల పునఃసర్వే పనులను ఆర్డీఓ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉమ్మడి భూమి హక్కు పత్రాల విభజనలో (ఎల్‌పీఎం) అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. భూమి హక్కులు, విస్తీర్ణం, అనుభవం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా రీసర్వే చేపట్టాలని సూచించారు. రైతుల భూ వివరాలు సక్రమంగా నమోదు చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రీసర్వే ద్వారా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉందని, రైతులు, గ్రామస్థులు అధికారులకు సహకరించాలని ఆర్డీఓ విజ్ఞప్తి చేశారు.

# క్షణికావేశంలో విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవద్దు







అరుణప్రభ 10 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : నలంద డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ కే . శంకర్ అధ్యక్షతన ఆత్మహత్య ల నివారణ దినోత్సవం కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ హాజరైనారు ఆత్మహత్యల నిరోధక దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రతి సంవత్సరం లిసెప్టెంబర్ 10వ తేదీనలి ప్రపంచవ్యాప్తంగా లిలి"ప్రపంచ ఆత్మహత్యల నిరోధక దినోత్సవం" నిర్వహిస్తారు. ఆత్మహత్యలను నివారించవచ్చనే అవగాహనను ప్రజల్లో పెంచడం, మానసిక ఆరోగ్యంపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం దేశంలో విద్యార్థిని విద్యార్థుల్లో 8 శాతం ఆత్మహత్యలు జరుగుతున్నవి ఎన్ సి ఆర్ బి నివేదిక చెప్పడం విచారకరం దేశంలో విద్యార్థులు ఆత్మహత్యల్లో తెలంగాణ రాష్ట్రం నాలుగో స్థానంలో ఉండడం బాధాకరం అని పేర్కొన్నారు ఒత్తిడి కుశీగు బాటు ఆందోళన విద్యార్థుల ఆత్మహత్యలకు కారణం అవుతున్నాయి ఆత్మ హత్యల నివారణకు దేశ సుప్రీంకోర్టు ఒక టాస్కోఫోర్స్ రిటైర్డ్ జడ్జి రవీంద్ర గారిని చైర్మన్ గా ఏర్పాటు చేయడం స్వాగతించవలసిన విషయము నిరంతరం విద్యార్థుల ఆత్మహత్యలపై విద్యార్థుల మానసిక ఆరోగ్యం పై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వెలుబుచ్చిన అంశాన్ని మేధావులు గమనించాలి . అలాగే సుప్రీంకోర్టు విద్యాసంస్థల్లో ఆత్మహత్ల నివారణకు ఒక టాస్క్ ఫోర్స్ వెబ్సైట్ ను కూడా ఏర్పాటు చేయాలని సూచించింది ఆత్మహత్యల నివారణకు ప్రతి విద్యా సంస్థ తప్పనిసరిగా ఒక సర్టిఫైడ్ సైకలాజికల్ కౌన్సిలర్ను నియమించాలని సూచించింది

**ఒక వ్యక్తి తీవ్రమైన ఒత్తిడి లేదా నిరాశలో ఉన్నప్పుడు కనిపించే కొన్ని ప్రధాన సంకేతాలు**

- జీవితంపై విరక్తితో మాట్లాడటం (ఉదాహరణకు: "నేను లేకపోతే అందరికీ ప్రశాంతంగా ఉంటుంది").
- కుటుంబం, స్నేహితులకు దూరంగా ఉండటం, ఒంటరిగా గడపడం.
- తీవ్రమైన మానసిక వేదన, నిద్రలేమి లేదా అతిగా నిద్రపోవడం.
- తమ ప్రియమైన వస్తువులను ఇతరులకు ఇచ్చేయడం లేదా వీడ్కోలు పలికే విధంగా ప్రవర్తించడం.

సహానుభూతితో వినడం సైకియాట్రిస్ట్ లేదా కౌన్సిలర్‌ను సంప్రదించడం ఆత్మహత్య ఆలోచనలు ఉన్నవారిని ఒంటరిగా వదిలేయకుండా వారికి ధైర్యం చెప్పాలి. ఎవరైనా తీవ్ర మానసిక ఒత్తిడి లేదా ఆత్మహత్య ఆలోచనలతో బాధపడుతుంటే వెంటనే సహాయం చేయాలి కావున ఎవరు ఆత్మహత్యకు ప్రయత్నించవద్దని బతికి సాధించాలని ప్రసంగించారు ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా కొలిపాక వెంకన్న సామాజికవేత్త హాజరైనారు ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అధ్యాపకులు ప్రసాద్ రవి ఉప్పలయ్య రమేష్ కే ప్రసాద్ రాజు కిషను విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# క్రీడలతో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయి

### జిల్లా ఎస్పీ డా. శబరీష్







అరుణప్రభ మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 10: గూడూరు జెడ్పీహెచ్ఎస్ (బాలుర) పాఠశాలలో నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గూడూరు జోనల్ స్థాయి క్రీడా పోటీలు, ఎంపికల కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డా. శబరీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా వివిధ పాఠశాలల నుంచి పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థి క్రీడాకారులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు క్రీడాకారులు తమకు ఇష్టమైన క్రీడలో నిరంతరం సాధన చేస్తూ, గెలుపు--ఓటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఓటమిని నిరాశగా భావించకుండా ఒక సవాలుగా తీసుకుని మరింత పట్టుదలతో ముందుకు సాగాలని, క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, నిరంతర సాధనే విజయానికి పునాదులని పేర్కొన్నారు విద్యార్థులు చెడు మార్గాలు, మాదకద్రవ్యాలు, ఇతర చెడు వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. వ్యసనాలు యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదం ఉన్నందున, ఆరోగ్య కరమైన జీవన విధానాన్ని అలవర్చుకుని విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని తెలిపారు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలను పాటిస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే ఉద్దేశంతో కార్యక్రమంలో సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన పోస్టర్లను ప్రదర్శించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, సందేశాలు, ఆన్‌లైన్ ఆఫర్లకు స్పందించవద్దని సూచించారు అలాగే "డ్రగ్స్‌కు దూరంగా ఉండండి -- ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోండి" అనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు క్రీడలు, విద్యలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే లక్ష్యంతో కృషి చేయాలని, తద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలతో పాటు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు.

# యక్కంటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పోస్టర్ ఆవిష్కరణ

### పర్యావరణ పరిరక్షణకు
### మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలి






కూకట్‌పల్లి, సెప్టెంబర్ 10 (అరుణ ప్రభ):లిలి పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సీనియర్ పర్యావరణ ఇంజనీర్ డి. నరేందర్ అన్నారు. పర్యావరణహిత వినాయక చవితిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మన అసోసియేషన్ అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ ఆఫ్ కూకట్‌పల్లి అధ్యక్షుడు యక్కంటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. మన అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను డి. నరేందర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని సూచించారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి వనరుల పరిరక్షణతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు దోహదపడుతుందని తెలిపారు. ప్రజలు పర్యావరణహిత పద్ధతుల్లో పండుగను జరుపుకుని ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యక్కంటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ పర్యావరణ ఇంజనీర్ డి. నరేందర్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జై గణేష్ భక్తి సమితి ప్రతినిధులు, అసోసియేషన్ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రోత్సహించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని నిర్వాహకులు కోరారు. "మట్టి వినాయకుడిని ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం"లిలి అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మరిన్ని అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని యక్కంటి వెంకటరెడ్డి తెలిపారు.



## బస్టాండ్, పాఠశాలకు గోడ గడియారాలు

ధర్మవరం, సెప్టెంబరు 10; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం, మున్సిపల్ కోట ప్రాథమిక పాఠశాలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రెండు పెద్ద గోడ గడియారాలను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు జయసింహ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిమ్మరాజుకు గడియారాలను అందజేశారు. ఈ సందర్భంగా జయసింహ మాట్లాడుతూ బస్టాండ్, పాఠశాలలో గడియారం అవసరాన్ని గుర్తించి ఈ సేవా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అలాగే సెప్టెంబరు 11న కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలకు రూ.5 వేల విలువైన కుట్టుమిషన్‌ను అందజేస్తామని తెలిపారు. సేవా కార్యక్రమాలను అభినందిస్తూ డిపో మేనేజర్, ప్రధానోపాధ్యాయుడు రోటరీ క్లబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, పెద్దారెడ్డి, నరేందర్‌రెడ్డి, నాగభూషణ, సుదర్శన్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



## దుర్గా నగర్‌లో మురుగు కాలువలు శుభ్రం

ధర్మవరం, సెప్టెంబరు 10; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం పట్టణంలోని 30వ వార్డు దుర్గా నగర్‌లో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపించారు. కాలువలు, డ్రైనేజీలు బ్లాక్ కావడంతో మురుగునీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానికులు టీడీపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన వార్డు నాయకులు, టీడీపీ కార్యకర్తలు మున్సిపల్ సిబ్బందితో కలిసి జేసీబీ సాయంతో కాలువల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. మురుగునీరు సజావుగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. సమస్యను వెంటనే పరిష్కరించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలపై నిరంతరం దృష్టి సారించాలని నాయకులు సూచించారు.



## బోధనలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

ధర్మవరం, సెప్టెంబరు 10; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం మండలంలోని శ్రీ గణేష్ మున్సిపల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను జిల్లా బోధనా పరిశీలన సమన్వయకర్త వినయ, మండల విద్యాశాఖ అధికారి బి.గోపాల్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు పాఠ్యాంశం పూర్తిగా అర్థమయ్యేలా శాస్త్రీయ పద్ధతుల్లో బోధించాలని, పాఠంతో పాటు అభ్యాసాలను సాధన చేయించాలని సూచించారు. విద్యార్థుల వ్యక్తిగత సామర్థ్యాలకు అనుగుణంగా బోధిస్తూ తరగతి గదిలో స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని తెలిపారు. బోధనా పరిశీలన కార్యక్రమంలో భాగంగా ధర్మవరం మండలంలోని ఉపాధ్యాయుల బోధనా విధానాలను పరిశీలించేందుకు 29 మంది సీనియర్ ఉపాధ్యాయులను నియమించినట్లు జిల్లా సమన్వయకర్త వినయ తెలిపారు.



## నేతన్న నేస్తం కోసం నేతన్నల ఎదురుచూపులు

ధర్మవరం, సెప్టెంబరు 10; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం పట్టణంలోని 4వ వార్డు శాంతినగర్‌లో గురువారం నిర్వహించిన 'గుడ్ మార్నింగ్' కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డికి నేతన్నలు తమ సమస్యలను వివరించారు. మూడు సంవత్సరాలుగా 'నేతన్న నేస్తం' ఆర్థిక సాయం అందడం లేదని, ఈ ఏడాదైనా వస్తుందని ఆశించినా నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. మగ్గంపై ఆధారపడి జీవిస్తున్న అర్హులైన నేతన్నలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.25 వేల 'నేతన్న సేవ' సాయం కూడా అందలేదని తెలిపారు. నేతన్నల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక సాయం అందేలా పోరాడతామని కేతిరెడ్డి తెలిపారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వార్డు ఇన్‌చార్జ్‌లు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పాత్రికేయుల ఐక్యతకు నూతన ప్రెస్ క్లబ్ ఏర్పాటు

### ఎల్లారెడ్డిపేట ప్రెస్ క్లబ్ అడ్‌హాక్ కమిటీ ఎన్నిక.
### జర్నలిస్టుల సంక్షేమం..
### హక్కుల పరిరక్షణ.. ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండా

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్ : ఎల్లారెడ్డిపేట మండల పాత్రికేయుల ఐక్యతకు కొత్త బాట పడింది. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యలను మరింత బలంగా ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లే లక్ష్యంతో ఎల్లారెడ్డిపేట ప్రెస్ క్లబ్ నూతన అడ్‌హాక్ కమిటీని గురువారం ఏర్పాటు చేశారు. పాత్రికేయులంతా ఐక్యంగా ఉంటేనే వృత్తిపరమైన సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించుకోవచ్చని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అన్యాయాలను ప్రశ్నించడం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం వంటి బాధ్యతలను మీడియా సమర్థవంతంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, జర్నలిస్టులకు అందాల్సిన సౌకర్యాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వృత్తిపరమైన ఇబ్బందులు, ఒత్తిళ్లు, గుర్తింపు, భద్రత తదితర అంశాల్లో అవసరమైన సమయంలో పాత్రికేయులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

**ప్రతి జర్నలిస్టుకు అండగా..**

ప్రెస్ క్లబ్‌ను కేవలం సమావేశాలకే పరిమితం చేయకుండా ప్రతి పాత్రికేయుడికి అండగా నిలిచే వేదికగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. జర్నలిస్టుల మధ్య సోదరభావం, పరస్పర సహకారం పెంపొందించడంతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక



కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా పాత్రను మరింత బలోపేతం చేస్తూ, వాస్తవాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని కమిటీ సభ్యులు తెలిపారు.

నూతన కార్యవర్గం కమిటీలో గౌరవ అధ్యక్షులు: బండారి బాల్ రెడ్డి, కాసు శ్రీనివాసరాజు, అధ్యక్షుడుగా బుగ్గ కృష్ణమూర్తి శర్మ, ఉపాధ్యక్షులుగా కులేరి కిషోర్ కుమార్, దుర్గం విజయ్ బాబు, పెంటం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగాఒగ్గు బాలరాజు యాదవ్, కార్యదర్శులుగా ఎం డి.లతీఫ్, మిట్టలక్ష్మి లక్ష్మీనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా కులేరి దీప్తి కుమార్, జగదీష్ లు, కోశాధికారిగాశ్రీరామోజు శేఖర్, గౌరవ సలహాదారులుగా ఎదురుగట్ల ముత్తయ్య, సి హెచ్ తిరుపతిగౌడ్, శ్రీరామోజు ప్రవీణ్, సురేష్ యాదవ్, కందుకూరి రవి లు, కార్యవర్గ సభ్యులుగా యమగొండ పద్మా రెడ్డి, మహమ్మద్ షరీఫ్, చేపూరి నాగరాజ్, బత్తిని శ్రీధర్ గౌడ్, చింతకింది శ్రీనివాస్ గౌడ్ ఒగ్గు మహేష్ చంద్రలు ఎన్నికయ్యారు.

# కంబాలపల్లిలో 3 మండలాల జోనల్‌స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం

అరుణప్రభ 10 సెప్టెంబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్ జోనల్ స్థాయి మహబూబాబాద్ బయ్యారం గార్ల మండలాల స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సమావేశానికి సభాధ్యక్షురాలు కంబాలపల్లి ప్రధానోపాధ్యాయులు గిరిజన వ్యవహరించారు. ఈ క్రీడా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహబూబాబాద్ రూరల్ సీఐ శ్రీమతి అంజలి గారు క్రీడాకారులను ఉద్దేశించి నాకు క్రీడలు అంటే ఇష్టం నేను ఖోఖో క్రీడలో రాష్ట్ర మరియు జాతీయస్థాయి పోటీలలో పాల్గొన్నాను అని తెలిపారు. క్రీడల్లో రాణించడం వల్లనే నేను ఈ స్థాయికి చేరుకున్నాను అని క్రీడాకారులను ఉద్దేశించి క్రీడల యొక్క ప్రాధాన్యతను వివరించారు. క్రీడాకారులు క్రీడలను క్రీడాస్ఫూర్తి గా తీసుకోవాలని గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని క్రీడలలో గెలుపు ఓటములు సహజమని తెలియజేశారు, గెలుపొందినప్పుడు ఆనందంగా ఓటమిపాలైనప్పుడు కృంగిపోవద్దని అన్నారు. క్రీడల ద్వారా జీవితంలో క్రమశిక్షణ అభివృద్ధి అవుతుంది, విద్యార్థిని విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పైన కూడా ఆసక్తి చూపాలని అప్పుడే విద్యార్థులు సర్వతో ముఖాభివృద్ధి చెందుతారు. ఉన్నత స్థాయిలో ఉంటారని విద్యార్థులను విద్యార్థిని విద్యార్థులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథి ఇంచార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారి మందుల శ్రీరాములు అతిథులు కంబాలపల్లి సర్పంచ్ చీరిక వసంత ఉపేందర్ రెడ్డి, మహబూబాద్ విద్యాశాఖ అధికారి ఆరుద్ర వెంకటేశ్వర్లు స్ఫూర్తి రూరల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు శ్రీరామ సహాయం శ్రీధర్ రెడ్డి, బిక్కి వెంకటేశ్వర్లు, కంబాలపల్లి ఉపసర్పంచ్ కమటం



యాకన్న,సిరంశెట్టి విజయ, కొమిరే ఉప్పలయ్య, ఆవారి శ్రీనివాస్, బానోతు చాంప్లానాయక్, వ్యాయామ ఉపాధ్యాయుడు మహంకాళి వెంకటేశ్వర్లు, వివిధ మండలాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ విమోచనదినాన్ని అధికారికంగా నిర్వహించాలి

### తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతి



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 10: : సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ ఎల్లారెడ్డిపేట మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలను స్మరించుకునేలా హైదరాబాద్‌లో భారీ 'స్టాట్యూ ఆఫ్ లిబరేషన్--తెలంగాణ' ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే హైదరాబాద్‌లో తెలంగాణ విమోచన మ్యూజియం ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి జిల్లా కేంద్రంలో తెలంగాణ విమోచన స్ఫూర్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ విమోచన చరిత్రను పాఠ్యపుస్తకాల్లో పొందుపరచాలని, విమోచన పోరాటంలో పాల్గొన్న అజ్ఞాత వీరుల అధికారిక జాబితాను రూపొందించాలని వారు కోరారు. అమరవీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేసేలా సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినంగా అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కృష్ణహరి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చందుపట్ల లక్ష్మారెడ్డి, ఎస్టీ మోర్చా నాయకుడు కిరణ్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, బందారపు లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, బాలకృష్ణ గౌడ్, బాలగౌడ్, రవిశంకర్, వంగల రాజిరెడ్డి, రంజిత్, గణేష్ నాయక్, రాజు నాయక్, రవి నాయక్, జవహర్, బాల్‌రెడ్డి, అంతర్పుల తిరుపతి, చరణ్ గౌడ్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలను పూజించాలి

### పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా
### భాగస్వాములు కావాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పూజించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలకు బదులుగా పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని సూచించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యావరణహిత గణేష్ నవరాత్రి ఉత్సవాలపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాలో ప్రజలకు సుమారు 2 వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించాలని కోరారు. పీఓపీ విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు జలవనరులను కాపాడుకోవచ్చన్నారు. ప్రకృతి, జలవనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పర్యావరణహితంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకుంటూనే పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఏఈఈ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య కోదండరాం సార్‌కు లక్షలాది మాలల తరపున శతకోటి జైభీమ్‌లు!

### మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడి స్వామి

గజ్వేల్ అరుణ ప్రభ : ఎస్సీ రోస్టర్ సవరణపై మాల మహానాడు విజ్ఞప్తిని గౌరవించి పెద్దల సభలో సమస్యను ప్రభుత్వానికి స్పష్టంగా తెలియజేసిన ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఆచార్య కోదండరాంకు లక్షలాది మాలల తరపున శతకోటి జైభీమ్‌లు తెలియజేస్తున్నట్లు మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడి స్వామి తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని కోదండరాం నివాసంలో ఆయనను మాల మహానాడు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ రోస్టర్ సవరణకు సంబంధించిన నివేదికను అసెంబ్లీకి వెళ్లి అందజేసినట్లు తెలిపారు. గత రెండు రోజులుగా కోదండరాం సార్‌తో కలిసి ఈ అంశంపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో మద్దతు తెలిపినప్పటికీ, మాదిగల వెనుకబాటుతనానికి మాలలు కారణం కాదని స్పష్టం చేసిన మేధావి కోదండరాం అని నీరుడి స్వామి కొనియాడారు. రోస్టర్ సవరణ పూర్తయ్యే వరకు తమకు అండగా నిలవాలని ఈ సందర్భంగా కోదండరాంను కోరినట్లు తెలిపారు. జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్, జాతీయ ప్రధాన కార్యదర్శి భైరి రమేష్, దార సత్యం, మాల సంక్షేమ



సంఘం చైర్మన్ బత్తుల రాంప్రసాద్, రాష్ట్ర పొలిట్‌బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మేడి అంజయ్య, బుట్టి సత్యనారాయణ, గార ఉపేందర్, నీరుడి స్వామి, కాల్వ నరేష్, లింగం కుమార్, ఉపేందర్, రత్నం తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

### భూమి, భుక్తి కోసం
### వెట్టిచాకిరి విముక్తికి పోరాడిన వీరనారి ఐలమ్మ

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్. : భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన తెలంగాణ వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ గుండాడి రామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్‌రెడ్డి, రజక సంఘం మండల వైస్ ప్రెసిడెంట్ వీరమ్మగారి శంకర్, మండల కార్యదర్శి గొల్లపల్లి సురేష్ మాట్లాడుతూ.. నాటి సామాజిక పరిస్థితుల్లో అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ ధైర్యంగా పోరాడారని గుర్తు చేశారు. భూమి, భుక్తి కోసం ఆమె సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని వారు కొనియాడారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ పసుల కృష్ణ, బీజేపీ నాయకులు నేవూరి శ్రీనివాస్‌రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ దొమ్మాటి దేవయ్య, మండల కమిటీ సభ్యులు ఎల్లయ్య, అజయ్, తిమ్మాపూర్, సింగారం గ్రామ శాఖల అధ్యక్షులు రమేష్, గంగాధర ధర్మయ్యతో పాటు రజక సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.



## అంబేద్కర్ సంఘం
### అధ్యక్షునిగా బీపేట రాజ్‌కుమార్ ఏకగ్రీవ ఎన్నిక
### నూతన కార్యవర్గానికి ఘన సన్మానం.

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్ నగర్ అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షునిగా బీపేట రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా అంతేర్పుల దేవరాజు, క్యాషియర్‌గా మస్కూరి సంసోన్, రైటర్‌గా ఎనగందుల మారుతి, అంగూరి ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఏర్పుల సెంట్రింగ్ నరసయ్య, కార్యదర్శులుగా ఊసి మోసి, ఏర్పుల రాయరాం దేవయ్య ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎలగందుల పోచయ్య, అందే వీరయ్య, అందే రాములు, ఊసి బాలేశ్లు, అంతర్పుల లక్ష్మణ్, అంతర్పుల దుర్గయ్య, బాయికాడి నరసయ్య, బక్కి రవి, మస్కూరి శ్రీనివాస్, అంగూరి ఆనందం, ఏర్పుల బ్యాంకు రాజయ్య, ననుగుల పద్మయ్య, జేరిపోతుల రాములు, జల్లి శంకర్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అలాగే మాజీ అధ్యక్షుడు అంతేర్పుల ఎల్లయ్య, మాజీ ఉపాధ్యక్షుడు ఏర్పుల హనుమయ్యలను కూడా ఘనంగా సత్కరించారు. సంఘం నూతన కార్యవర్గం అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేస్తూ, సంఘ సభ్యుల సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎలగందుల నరసింహులు, అంబేద్కర్ సంఘం కుల పెద్దలు, యూత్ సభ్యులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ధీరవనిత కొంగు నడుముకు చుట్టి..
## కొడవలి చేతపట్టి.. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి
### పెద్దతూప్రలో
### రజక సామాజిక వర్గం ఆధ్వర్యంలో కార్యక్రమం

అరుణ ప్రభ -- శంషాబాద్ జోన్: శంషాబాద్ మండలం పెద్దతూప్ర గ్రామంలో రజక సామాజిక వర్గం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. శంషాబాద్ మండలం మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్, సర్పంచ్ అంకం సుమలత రాజు యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ధైర్యంగా నిలబడి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ గారు మహిళా శక్తికి,ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. పేదలు, రైతులు,మహిళల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దిద్యాల శేఖర్, వార్డు సభ్యులు దిద్యాల నరేష్ కుమార్, నల్లొల్ల అశోక్, బోద్దం శివ యాదవ్, ప్యాక్స్ డైరెక్టర్ దిద్యాల గౌతమ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షుడు జయం రాజు పాల్గొన్నారు. అలాగే కార్యవర్గ సభ్యులు డి. చెన్నకేశవ్, బి. విజయ్, ఎన్. కృష్ణ, ఎన్. శ్రీచరణ్, టి. దాస్, ఎన్. మహేష్‌తో పాటు రజక సామాజిక వర్గం సభ్యులు, సీనియర్ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు నివాళులు అర్పించారు. చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పలువురు పేర్కొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిద్దాం

### అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి
### మండపాల నిర్వాహకులు పోలీస్, ఎన్‌పీడీసీఎల్ అధికారుల వద్ద వివరాలు నమోదు చేసుకోవాలి



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వినాయక చవితి నేపథ్యంలో గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎస్పీ మహేష్ బి. గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు అన్ని గ్రామాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. మున్సిపల్, సెస్, మత్స్య, పోలీస్, రవాణా, ఆర్అండ్‌బీ, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో అవసరమైన క్రేన్లు, జేసీబీలు, విద్యుత్ దీపాలు, నీటి సదుపాయాలను ముందుగానే ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. భక్తులకు నీటిని స్టీల్ గ్లాసులతో అందించాలని, ప్రతి మండపం వద్ద డస్ట్‌బిన్ ఏర్పాటు చేయడంతో పాటు మండపాల వారీగా మున్సిపల్ సిబ్బందిని నియమించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జనం రోజున విగ్రహాలు వెళ్లే మార్గాల్లో విద్యుత్ తీగల వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్‌పీడీసీఎల్ అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు తమ వివరాలను ఎన్‌పీడీసీఎల్ అధికారుల వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలోని నిమజ్జన ప్రాంతాలతో పాటు అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో జాలర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 24 గంటలూ అంబులెన్స్‌లు, మందులు, ఫస్ట్‌ఎయిడ్ కిట్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సిరిసిల్ల జీజీహెచ్, వేములవాడ ఏరియా ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, జిల్లా రవాణా శాఖ అధికారులు నిమజ్జనం సాఫీగా జరిగేలా ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వినాయక విగ్రహాలు తరలించే రహదారుల్లో అవసరమైన మరమ్మతులను ఆర్అండ్‌బీ అధికారులు చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టి గడ్డి, చెత్తాచెదారం తొలగించాలని, నీటి వనరుల వద్ద బారికేడింగ్, లైటింగ్, క్రేన్లను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. నిమజ్జనం పూర్తయిన అనంతరం రెండు, మూడు రోజుల పాటు అన్ని వార్డులు, గ్రామ పంచాయతీల పరిధిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

**మండల స్థాయిలో సమన్వయ సమావేశాలు**

సిరిసిల్ల, వేములవాడ డివిజన్లతో పాటు ఆయా మండలాల పరిధిలో ఆర్డీవోలు, తహసీల్దార్లు వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. నవరాత్రి ఉత్సవాల ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు.

**మండపాల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి**

జిల్లాలోని అన్ని గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా తమ వివరాలను పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. నిమజ్జనం రోజున నిర్ణీత సమయానికి విగ్రహాలను తరలించాలని కోరారు. ప్రతి మండపం వద్ద ప్లాస్టిక్ డ్రమ్‌లలో నీరు, ఇసుకను సిద్ధంగా ఉంచాలని సూచించారు. మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎస్పీ తెలిపారు. మహిళలకు ఎలాంటి ఇబ్బంది కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కేఎస్‌బీ కుమారి, డీఎస్పీలు నాగేంద్రాచారి, శ్రీనివాసులు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, ఎక్సైజ్ శాఖ అధికారి హిమశ్రీ, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారి దయాకర్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, ఎన్‌పీడీసీఎల్, జిల్లా పంచాయతీ, మత్స్య శాఖ అధికారులు, తహసీల్దార్లు మహేష్, జయంత్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఐలమ్మ ఆశయాలు ఇంకా మిగిలే ఉన్నాయి

### అణగారిన వర్గాల సమున్నత అభివృద్ధి సాధించేది కమ్యూనిస్టులే
### ఐలమ్మ 41వ వర్ధంతి సభలో నివాళులర్పించిన సిపిఐఎంఎల్ లిబరేషన్ శ్రేణులు

అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : భూమి, భుక్తి , విముక్తి సకలజనుల హితం కోసం సాగిన రైతాంగ సాయుధ పోరాటం ఇచ్చిన నినాదాలు ఇంకా మిగిలే వున్నాయని సిపిఐ ఏం ఎల్ లిబరేషన్ జనగామ జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజుల సాంబయ్య అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి పురస్కరించుకొని ఆ పార్టీ శ్రేణులతో కలిసి ఐలమ్మ కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గుమ్మడి రాజుల సాంబయ్య మాట్లాడుతూ సాయుధ పోరాటం ఇచ్చిన స్ఫూర్తి, చాకలి ఐలమ్మ తెగువ నేటి తరానికి ఆదర్శమని ఆయన అన్నారు. సాయుధ పోరాటాన్ని రెండు మతాల మధ్య పోరాటంగా ప్రచారం చేస్తున్న కేంద్రపాలకుల తీరు అక్షేపణీయమని ,నాటి నైజాం సర్కార్ కు వ్యతిరేకంగా సకల జనులు సాయుధ పోరాటాన్ని నడిపారని ఆ పోరాటంలో ఐలమ్మ చూపిన తెగువ మరువలేనిదని సాంబయ్య గుర్తు చేశారు.నేటికి భారత పాలకులు ప్రజల మధ్య మతాలచిచ్చుపెడుతున్నర ని ప్రజలు పాలకుల కుట్రలను అర్థం చేసుకోవాలని లేకుంటే పెను ప్రమాదం పొంచి ఉన్నదని సాంబయ్య ఆరోపించారు. పాలకులు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా యువతను,వారి ప్రతిభను చులకనచేస్తున్నారని అందుకే జెన్ జి ఉద్యమాలు పుట్టుకొస్తున్నాయనీ ఇది మంచిపరిణామమనిఆయన్నను. మొత్తంగా అణగారిన వర్గాల సమున్నత సాధికారత సాధించాలంటే అది కేవలం కమ్యూనిస్టులకే సాధ్యం అని సాంబయ్య స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి కొనుకటి కళింగ రాజు . నాయకులు గాయాల బాబు. గ్యార రాజు. తూర్పాటి సారయ్య.పెద్ది రాహుల్. కార్తీక్ .కొన్నె బద్రి. జనగాం అశోక్. గడపురం నవ తేజ తదితరులు పాల్గొన్నారు.



## అవగాహన శిబిరాలను నిర్వహించాలి

అరుణప్రభ మహబూబాబాద్, సెప్టెంబర్.10 : గురువారం ఐ.డి.ఓ.సి కార్యాల యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ హెచ్ఐవి క్యూఆర్ కోడ్ పద్ధతిలో అవగాహన శిబిరాలను నిర్వహించాలని సంబంధిత వైద్యాధికారులకు, సూపర్వైజర్లకు సూచించారు కురవి, నెల్లికుదురు, మరిపెడ, కేసముద్రం, తొర్రూర్ మండలాల్లోని వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో హెచ్ఐవి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు అదేవిధంగా పాఠశాలలు మరియు కళాశాలల్లో విద్యార్థులకు క్యూఆర్ కోడ్ పద్ధతిలో, డ్రాయింగ్ మరియు పోస్టర్ పద్ధతుల్లో హెచ్ఐవి పై అవగాహన కార్యక్రమాలు, శిబిరాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సూచించారు హెచ్ఐవి నివారణపై ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ చురుకుగా పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ సూచించారు ఈ సమావేశంలో మెడికల్ అధికారులు, ప్రోగ్రాం అధికారి డా.అర్జున్, జ్యోతి, డిప్యూటీ డెమో రాజ్ కుమార్, సూపర్వైజర్లు, ఎం.ఎల్.హెచ్.పి.లు, తదితరులు పాల్గొన్నారు

## సెప్టెంబర్ 12న జాతీయ మెగా లోక్ అదాలత్



ధర్మవరం, సెప్టెంబర్ 10; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో సెప్టెంబర్ 12న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోక్ అదాలత్ విజయవంతానికి పోలీస్ శాఖ, న్యాయవాదులు సమన్వయంతో సహకరించాలని జడ్జి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.



## రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్‌కు ధర్మవరం విద్యార్థులు

ధర్మవరం, సెప్టెంబర్ 10; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన వై. అశోక్‌బాబు, జి. సాయిప్రసాద్ అండర్-16 బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు రామకృష్ణప్ప తెలిపారు. మార్కాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని పీడీ నాగేంద్ర తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

## ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లా ఆనంద్

### విద్యార్థి వర్గాల్లో హర్షాతిరేకాలు



అరుణ ప్రభ శంషాబాద్ జోన్ సెప్టెంబర్ 10: తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఎన్ ఎస్ యు ఐ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న యువ నాయకుడు జిల్లా ఆనంద్‌ను ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకంపై రాష్ట్రవ్యాప్తంగా ఎన్ ఎస్ యు ఐ శ్రేణుల్లో, విద్యార్థి వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. విద్యార్థుల హక్కుల కోసం ముందుండి పోరాడుతున్న నాయకుడికి కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల పలువురు విద్యార్థి నాయకులు అభినందనలు తెలిపారు.

**విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం**

నూతనంగా నియమితులైన ఎన్ ఎస్ యు ఐరాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా ఆనంద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ స్వామి, అక్బర్, రాజ్యసభ సభ్యులు అనిల్ యాదవ్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎల్లప్పుడూ వెన్నంటే ఉండి ప్రోత్సహిస్తున్న స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి తనకు హోదా కాదని, విద్యార్థుల కోసం మరింత బాధ్యతగా పనిచేసే అవకాశం అని ఆనంద్ అన్నారు. ఫీజుల పెంపు, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ వసతులు, ఉద్యోగ నోటిఫికేషన్లు తదితర సమస్యలపై విద్యార్థుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ ఎస్ యు ఐ ని మరింత బలోపేతం చేసి, ప్రతి కళాశాలలో విద్యార్థుల సమస్యలపై పోరాడే బలమైన నాయకత్వాన్ని నిర్మిస్తామని తెలిపారు. త్వరలో అన్ని జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి విద్యార్థుల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని జిల్లా ఆనంద్ పేర్కొన్నారు.

## తండ్రి లేని పేదింటి ఆడపిల్ల వివాహానికి ఉప్పల ఫౌండేషన్ అండ

### పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటున్న ఉప్పల
### పుస్తె మట్టెలు, చీర, గాజులు అందజేసిన ఉప్పల శ్రీనివాస్ గుప్త
### తండ్రి లేని పేదింటి దళిత సామాజిక వర్గానికి చెందిన ఆడపిల్ల వివాహానికి ఉప్పల ఫౌండేషన్ అండగా నిలిచింది.



సెప్టెంబర్ 10, అరుణ ప్రభ : సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవ్‌పల్లి గ్రామానికి చెందిన గుండెల్లి యాదమ్మ--కీ.శే. కిషన్ దంపతుల కుటుంబానికి చెందిన ఆడపిల్ల వివాహం సందర్భంగా ఉప్పల ఫౌండేషన్ తరఫున చీర గాజులు పూస్తె మట్టెలు అందజేశారు. నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్ గుప్త గారి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త స్వయంగా వధువుకు పుస్తె మట్టెలు, చీర, గాజులు అందజేసి, నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో వివాహం చేసుకోలేని పేద కుటుంబాలకు తమ వంతు సహాయం అందించడం ఉప్పల ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. తండ్రి లేని ఆడపిల్ల వివాహానికి అండగా నిలవడం తనకు ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు. నూతన వధూవరులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో, అన్యోన్యంగా జీవించాలని ఆకాంక్షించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల ఫౌండేషన్ కో చైర్మెన్ ఉప్పల స్వప్న , లక్ష్మి దేవ్ పల్లి గ్రామానికి చెందిన యువజన సంఘం నాయకుడు కనక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## బీజేపీలోకి బీసీ జిల్లా అధ్యక్షుడు చేరిక

అరుణప్రభ 10 సెప్టెంబర్ మహబూబాబాద్ : భారతీయ జనతా పార్టీలో బీసీ జిల్లా అధ్యక్షులు నామని సదానందం చేరడం జరిగింది బీజేపీ రాష్ట్ర నాయకులు రాంబాబు నాయక్ మరియు మండల అధ్యక్షులు రాసమల్ల వెంకటేశ్వర్లులి ఆధ్వర్యంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు నాయక్ మాట్లాడుతూ, బీజేపీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు మరియు ప్రజా సంక్షేమ విధానాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబెర్ మెరుగు మల్లయ్య గౌడ్ మండల ప్రధాన కార్యదర్శి నల్గొండ అనిల్ దేసు సురేష్ తదితరులు పాల్గొన్నారు..?



## 12వ పీఆర్సీ కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలి

ధర్మవరం, సెప్టెంబర్ 10; (అరుణ ప్రభ న్యూస్) : ప్రభుత్వ హామీ మేరకు 12వ పీఆర్సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణనాయక్, జిల్లా కార్యదర్శి అమర్‌నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఆలస్యం జరిగితే ఉద్యోగ, ఉపాధ్యాయులకు 29 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. ధర్మవరం మండలం ఏలుకుంట్ల ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు.

## దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండించాలి



అరుణ ప్రభ, డిండి ,సెప్టెంబర్ 9 ,దళిత స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని డిండి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు మల్లేష్ నాయక్ అన్నారు .అసెంబ్లీలో దళిత స్పీకర్ పై బి ఆర్ఎస్ ఎమ్మెల్సీ లు చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన శాసనసభలో స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వవలసిన బాధ్యత ప్రజాప్రతినిలపై ఉందన్నారు

# దేవాలయం ఆవరణలో షెడ్డు కూల్చిన టౌన్ ప్లానింగ్ అధికారి

# డిసిపి హరిదాసు ఏసిపి ఝాన్సీ భారీగా ముడుపులు తీసుకుంటున్నారు

**ఆక్రమణల జోలికి పోనీ డీసీపీ దేవాలయం షెడ్ పై కన్ను పడింది**

**ఈస్ట్ జోన్ టౌన్ ప్లానింగ్ వ్యవహారంపై మండిపడుతున్న భక్తులు**



విశాఖపట్నం అరుణ ప్రభ న్యూస్.... నగరమంతా ఆక్రమణలు జోరుగా అవినీతి మత్తులో అధికారులు పనిచేస్తూ సహకరిస్తున్నారు. అయితే దేవాలయానికి వచ్చే భక్తుల కోసం ఎండకు వర్షానికి ఆసరాగా ఉంటుందని దాతల సహకారంతో షెడ్డు నిర్మిస్తే ఆనాధికారికంగా నిర్మించారు అంటూ డిసిపి హరిదాస్ తన ప్రతాపం చూపించి సిబ్బందితో తొలగించేశారు. విశాఖలో ప్రముఖ దేవాలయంగా పేరొందిన ఎర్నిమాంబ దేవాలయం రహదారి మధ్యలో ఉంది. దర్శనం కు వచ్చే ప్రజలకు నిలువ నీడ ఏర్పాటు చేయవలసి ఉన్నప్పటికీ ఇబ్బందికరంగా మారడంతో తాత్కాలికంగా కొందరి సహకారంతో షెడ్డు నిర్మాణం ఇటీవల చేపట్టారు. అయితే డిసిపి హరిదాస్ తాను కరెక్ట్ గా ఉన్నానంటూ యమ దూకుడు మీద చెడ్డపై కన్ను వేసి ఆగమేఘాల మీద గురువారం తొలగించేసి నాన్న హడావిడి సృష్టించారు. చివరకు అధికారులు స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లిన డిసిపి హరిదాసు తరుణ్ తాను మినిస్టర్ తాలూకా ఎవరు చెప్పిన వినను అంటూ బహిరంగంగా పేర్కొనడం సంచలనంగా మారింది. ఒక దేవాలయానికి దాతల సహకారంతో ఎవరికి ఇబ్బంది లేకుండా చెడ్డ నిర్మిస్తే కేవలం తన అహంకారం మాత చెల్లుబాటు కోసం సౌత్ జోన్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఇలా వ్యవహరించి తమ పరాకాష్ట చూపించుకున్నారు. సౌత్ జోన్లో అడ్డగోలుగా వందల అక్రమ నిర్మాణాలు జరుగుతున్న పట్టించుకోలేని ఎసిపి డిసిపి టిపిఓ సిబ్బంది కేవలం షెడ్ ప్రపంచానికి ప్రజలకు ఇబ్బందిగా ఉన్నట్లుగా భావిస్తూ తొలగించడం వ్యవహరించడం దారుణమని భక్తులు చెబుతున్నారు. ఏది ఏమైనా టౌన్ ప్లానింగ్ అధికారులపై ఎమ్మెల్యే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు

# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమాలు

## ప్రజ్ఞాపూర్ నుంచి గజ్వేల్ వరకు బైక్ ర్యాలీ

గజ్వేల్ అరుణ ప్రభ : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమాలు చేపడతామని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రజ్ఞాపూర్ నుంచి గజ్వేల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ప్రజ్ఞాపూర్‌లోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీగా గజ్వేల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ నిజాం నిరంకుశత్వం, రాచరికం, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగిందన్నారు. పేద రైతులు, కూలీలు, వృత్తిదారులు, దళితులు, గిరిజనులు వెట్టి చాకిరీ, అధిక పన్నులు, భూస్వాముల దోపిడీకి గురయ్యారని తెలిపారు. మహిళలపై జరిగిన అణచివేతకు వ్యతిరేకంగా కూడా ప్రజలు తిరుగుబాటు చేశారని పేర్కొన్నారు. 1946 జూలై 4న కడవెండిలో దొడ్డి కొమురయ్యను కాల్చి చంపిన ఘటనతో పోరాటం తెలంగాణ వ్యాప్తంగా విస్తరించిందన్నారు. చిట్యాల ఐలమ్మ విస్నూర్ రామచంద్రారెడ్డి వంటి భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి, పేద ప్రజల హక్కుల కోసం నిలిచిన వీరనారి అని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగా భూ పంపిణీ, కౌలు రైతుల రక్షణ, గ్రామ స్వరాజ్యాల ఏర్పాటు వంటి అనేక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఎల్లయ్య విమర్శించారు. నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు



పెరుగుతున్నాయని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై అదనపు భారాన్ని మోపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో దోపిడీ విధానాలు, పన్నుల భారానికి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 10 నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, వేణుగోపాల్, బిక్షపతి, దళిత సంఘాల ఐకాస నాయకులు చిప్పల యాదగిరి, సీపీఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, అహ్మద్, రవికుమార్, స్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్, రామారావు, పరశురాములు, కిషోర్, అక్బర్, లక్ష్మణ్, యాదగిరి, ప్రవీణ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్‌లో చిన్న పత్రికల భారీ ఎగ్జిబిషన్

**విజేతలకు నగదు బహుమతి.. 'చిన్న పత్రికల' అసోసియేషన్ ప్రకటన**



హైదరాబాద్:సెప్టెంబర్10 చిన్న పత్రికల ఎడిటర్లు స్వయం ఉపాధితో జీవనం సాగిస్తున్నారని,తమకు తాము ఉపాధి కల్పించుకుంటూ మరికొంతమందికి ఉపాధి కల్పిస్తున్నారని వారి సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని 'తెలంగాణ స్మాల్, మీడియం న్యూస్ పేపర్స్ అండ్ మ్యాగజైన్స్ అసోసియేషన్' రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో యూసుఫ్ బాబు అధ్యక్షతన నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న పత్రికల నిర్వహణలో ఎడిటర్లు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, బిల్స్ పెండింగులో ఉన్నాయని, గత కొంతకాలంగా రెగ్యులర్గా ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలను ఇవ్వడంలేదని ఆయన అన్నారు.

**అక్టోబర్‌లో పత్రికల ఎగ్జిబిషన్ -- త్రిభాషా పోటీలు**

చిన్న పత్రికల విశిష్టతను ప్రపంచానికి తెలియజేసేందుకు అక్టోబర్‌లో రెండు రోజుల పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పత్రికలతో భారీ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ దినపత్రికలు, మ్యాగజైన్స్ విభాగాల్లో ప్రదర్శనలు ఉంటాయి. ప్రతి విభాగంలోనూ ఉత్తమ పత్రికలకు నగదు పురస్కారాలు,జ్ఞాపికలు, సర్టిఫికెట్స్ ఇస్తామని ప్రథమ (రూ. 10,000), ద్వితీయ (రూ. 7,000), తృతీయ (రూ. 3,000) నగదు బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నామని పేర్కొన్నారు. ఎగ్జిబిషన్‌లో పాల్గొనే దినపత్రికలు రూ. 2,000, మ్యాగజైన్లు రూ. 1,000 రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

ఈ కార్యక్రమానికి మంత్రులను, ఇరు రాష్ట్రాల సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్లను, మీడియా అకాడమీ చైర్మన్ లను ఆహ్వానించనున్నట్లు వెల్లడించారు. వేదిక వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

**ప్రభుత్వ ప్రకటనలు, ఇంటి స్థలాలపై పోరు**

సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ.. గత 8 నెలలుగా చిన్న పత్రికలకు ప్రభుత్వ ప్రకటనలు విడుదల కాకపోవడం శోచనీయమన్నారు. ఆందోళన బాటపడితే తప్ప ప్రకటనలు ఇచ్చే పరిస్థితి లేదని, జర్నలిస్టులకు ఇంటి స్థలాల సాధనపై కూడా స్పష్టమైన కార్యాచరణతో ముందడుగు వేస్తామన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి ఆజం ఖాన్,రాష్ట్ర నాయకులు దాస్ మాతంగి, కె. రాజిరెడ్డి గడ్డమీది బాలరాజు,సలీం పాషా, డి. బాలకృష్ణ,గోళ్ళ రమేష్, సాజిదా సికందర్,మక్సూద్ తదితరులు పాల్గొన్నారు.



# వేద పరీక్షల్లో వేములవాడ వేద పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**ఐదుగురు విద్యార్థులకు ప్రథమ శ్రేణి.. ఈవో చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు.**

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ . : శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రాజరాజేశ్వర వేద పాఠశాల విద్యార్థులు వివిధ వేద పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని సరిపల్లె గ్రామంలో ఆగస్టు 28న, రాజమహేంద్రవరంలోని వేద శాస్త్ర పరిషత్‌లో సెప్టెంబర్ 4న, పిఠాపురంలో సెప్టెంబర్ 6న నిర్వహించిన సామవేద పరీక్షల్లో వేద పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన వారిలో కే. లక్ష్మీ నరసింహ శర్మ (మంథని), ఎస్. వినాయక శర్మ (కరీంనగర్), ఎం. షణ్ముఖ శర్మ (మెట్‌పల్లి), ఆర్. షణ్ముఖ శర్మ (జమ్మికుంట), ఏ. సత్యనారాయణ శాస్త్రి (వేములవాడ) ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. వేద విద్యలో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, విశేష నైపుణ్యాన్ని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వేద పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సీనియర్ అసిస్టెంట్ వంశీ మోహన శర్మతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



# అన్న క్యాంటీన్‌లో భోజన నాణ్యత పరిశీలన

ధర్మవరం, సెప్టెంబర్ 10; (అరుణ ప్రభ న్యూస్) : శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ అంబటి సతీష్ కుమార్, ధర్మవరం టౌన్ అధ్యక్షుడు జింక చంద్రశేఖర్ గురువారం సందర్శించారు. క్యాంటీన్‌లో అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, రుచికరంగా, నాణ్యతగా ఉందని తెలిపారు. తక్కువ ధరకే భోజనం అందుతుండటంపై క్యాంటీన్‌కు వచ్చిన ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే కూటమి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలని పలువురు ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ టౌన్ అధ్యక్షుడు మహేశ్ ప్రజాపతి, టౌన్ వైస్ ప్రెసిడెంట్ చెన్న ఆదినారాయణ, కిసాన్ మోర్చా జిల్లా వైస్ ప్రెసిడెంట్ బూర్గుల వరప్రసాద్ రెడ్డి (బీవీఆర్) తదితరులు పాల్గొన్నారు.



## పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు

## సీమంతం, అన్నప్రసన వేడుకలు

అరుణ ప్రభ బూర్గంపాడు:- పౌష్టికాహారం తోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు ఉంటుందని సర్పంచ్ భానోత్ నరసింహ అన్నారు. మండల పరిధిలోని అంజనాపురం గ్రామంలో గురువారం సీమంతం, అన్నప్రసన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ బానోత్ నరసింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలలో ప్రత్యేకంగా గర్భిణీలకు చిన్న పిల్లలకు బలవర్ధకమైన పౌష్టిక ఆహారం అందిస్తున్నారని గర్భిణీలు చిన్నపిల్లలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ప్రాధాన్యంపై అవగాహన ఉండాలని అన్నారు. గర్భిణులు సమతుల ఆహారం తీసుకోవడంతో పాటు ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో తప్పనిసరిగా టీకాలు వేయించుకోవడంతో పాటు పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో కీలకమని పేర్కొంటూ, గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ స్వరాజ్యం, ఏఎన్ఎం, అంగన్వాడీ సిబ్బంది, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్ పరిధిలో

## పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్‌పై స్పష్టత ఇవ్వాలి

**ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు**

**శాసనసభలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రస్తావన**



హైదరాబాద్: అరుణ ప్రభ, సెప్టెంబర్ 10. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని నాలుగు కమిషనరేట్ల పరిధిలో పోలీస్ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌పై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. శాసనసభ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో వివిధ అంశాలను ప్రస్తావించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి.. పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ అంశాన్ని ప్రత్యేకంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఏళ్ల తరబడి పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది అభ్యర్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో పోలీస్ ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్లు వెలువడినప్పటికీ, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ల పరిధిలో నోటిఫికేషన్‌పై స్పష్టత లేకపోవడంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ నాలుగు కమిషనరేట్ల పరిధిలో పోలీస్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయం ఏమిటో స్పష్టంగా ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అభ్యర్థుల్లో నెలకొన్న సందిగ్ధతకు తెరదించి, ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై స్పష్టమైన ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చిన కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి.. ఈ అంశంపై ఉపముఖ్యమంత్రితో చర్చించి తగిన స్పష్టత ఇస్తామని తెలిపారు.



## అయ్యప్ప స్వామికి ఘనంగా పంచామృత అభిషేకాలు

**అయ్యప్ప స్వామి అనుగ్రహం అందరిపై ఉండాలి : ఎన్.సి. సంతోష్**

గజ్వేల్ అరుణ ప్రభ : సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రావణమాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్.సి. రాజమౌళి, అనసూయ దంపతులు, వారి కుమారుడు ఎన్.సి. సంతోష్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు కైలాస ప్రభాకర్, పద్మ దంపతులు, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్.సి. సంతోష్ మాట్లాడుతూ అయ్యప్ప స్వామి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బొగ్గుల సురేష్, ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా ప్రతిరోజూ దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవభక్తితో పాటు సేవాగుణాన్ని కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు, నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్, కోశాధికారి నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు మరియాల శ్రీనివాస్, గందె యాదగిరి, దేవానంద్, కైలాస ప్రశాంత్, ఉమేష్, డెంటల్ శ్రీనివాస్, గందె సంతోష్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## నర్సారెడ్డిని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్ అరుణ ప్రభ : ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడి సందర్భంగా జరిగిన తోపులాటలో తీవ్రంగా గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని పలువురు కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. తెలంగాణ రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ వహీద్, షకీల్ భాయ్, జహంగీర్ తదితరులు నిమ్స్ ఆసుపత్రిని సందర్శించి నర్సారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు నాయిని సత్యలక్ష్మి యాదగిరి, నక్క సంతోష, రాములు గౌడ్, మన్నె కృపానందం తదితరులు నర్సారెడ్డిని పరామర్శించారు. ఆయనకు అందుతున్న వైద్య సేవల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నర్సారెడ్డి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలోకి రావాలని నాయకులు ఆకాంక్షించారు.

# మనోధైర్యంతో ముందుకు సాగాలి

### మానసిక సమస్యలతో బాధపడేవారు
### 14416 టోల్‌ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవాలి.
### ఆత్మహత్యల నివారణ దినం
### పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ గరిమ అగ్రవాల్



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : మానసిక ఒత్తిడి, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారు ఆత్మన్యూనతకు లోనుకాకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. మానసిక సమస్యలను దాచిపెట్టకుండా కుటుంబ సభ్యులు, వైద్యులతో మాట్లాడి అవసరమైన చికిత్స పొందాలని ఆమె పేర్కొన్నారు. ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం టెలీ-మానస్ టోల్‌ఫ్రీ నంబర్ 14416కు సంబంధించిన అవగాహన పోస్టర్లను కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆత్మహత్యల నివారణపై ప్రజలకు చైతన్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణ, ఆత్మహత్యల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మానసిక సమస్యలకు చికిత్స తీసుకోవడానికి బదులుగా చాలామంది వాటిని దాచిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, తమ సమస్యల గురించి ఇతరులతో మాట్లాడేందుకు కూడా ఇష్టపడటం లేదని కలెక్టర్ తెలిపారు. మానసిక ఆరోగ్య సమస్యలు కూడా ఇతర అనారోగ్య సమస్యల మాదిరిగానే చికిత్సతో మెరుగుపడతాయని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రుల్లో మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. చికిత్స పొందుతున్న వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఆత్మహత్యల నివారణకు టెలీ-మానస్ 14416 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా 24 గంటలూ, 7 రోజులూ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. మానసిక ఒత్తిడి లేదా ఆత్మహత్య ఆలోచనలు ఎదుర్కొంటున్న వారు వెంటనే 14416కు ఫోన్ చేసి నిపుణుల సలహా పొందాలని కలెక్టర్ సూచించారు. వైద్యుల సూచన మేరకు మందులను నిర్దేశిత మోతాదులో క్రమం తప్పకుండా వినియోగించడం ద్వారా మానసిక సమస్యలను నియంత్రించుకోవచ్చన్నారు. ఆత్మహత్యల నివారణలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజం కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆత్మన్యూనత భావంతో బాధపడుతున్న వారిని ఒంటరిగా వదిలేయకుండా వారికి ఆత్మీయంగా అండగా నిలిచి, వారి సమస్యలను అర్థం చేసుకుని అవసరమైన వైద్య సహాయం అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నయీమా జహా, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ సబ్ సెంటర్ల పనులను వేగంగా పూర్తి చేయాలి

### అన్ని మౌలిక వసతులు కల్పించి
### వినియోగంలోకి తీసుకురావాలి.: కలెక్టర్ గరిమ అగ్రవాల్



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్మాణంలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్ల భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి, తుది దశ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సబ్ సెంటర్లలో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం పంచాయతీరాజ్ శాఖ, టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో జిల్లాలో కొనసాగుతున్న హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణ పనులపై ఆయా శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్‌హెచ్ఎం, 15వ ఆర్థిక సంఘం తదితర నిధులతో చేపడుతున్న నిర్మాణ పనుల పురోగతిని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఎన్‌హెచ్ఎం నిధులతో నిర్మించిన 9 హెల్త్ సబ్ సెంటర్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన ఒక సబ్ సెంటర్ కూడా ప్రారంభానికి సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ఇతర నిధులతో చేపట్టిన ఆరు సబ్ సెంటర్ భవనాల నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ తుది దశలో ఉన్న భవన నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సబ్ సెంటర్లలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని ఆయా శాఖల జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని, క్షేత్రస్థాయిలో పనులను పరిశీలిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సబ్ సెంటర్లు అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ఈఈ సుదర్శన్ రెడ్డి, టీజీఎంఎస్ఐడీసీ ఈఈ విశ్వప్రసాద్, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలి

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పూలపల్లి సుధాకర్ రెడ్డి
### ఐలమ్మ ఆశయాలను కొనసాగిద్దాం
### రజక సంఘం జిల్లా అధ్యక్షులు చెంచలపు శ్రీనివాసరావు

వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని ఆమె పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పూలపల్లి సుధాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగినేని ప్రోలు గ్రామంలో గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రజక సంఘం నాయకులతో కలిసి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

**ఐలమ్మ ఆశయాలను కొనసాగిద్దాం**

ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు రజకుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా కృషి చేయాలని రజక సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. దొరల పాలన నుంచి విముక్తి పొందేందుకు ఆనాడు రోకలిబండనే తన ఆయుధంగా చేసుకొని నాటి మహిళలకు నేటి మహిళ లోకానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన ఐలమ్మ అని కొనియాడారు. ప్రభుత్వంలో రజకులకు కావలసిన హక్కులను సాధించేందుకు సంఘటితం గా ముందుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ నాయకులు కాటం వెంకట్రామిరెడ్డి, బోనం నాగిరెడ్డి, ఆవుల వెంకట రావమ్మ, చిలంకూరి భాస్కరరావు, రజక సంఘం నాయకులు చంచెలపు సత్యనారాయణ, ముదిగొండ వీరన్న, చెంచలపు శ్రీకాంత్ చెంచలపు నాగరాజు, భరత్, గ్రామస్థులు పాల్గొన్నారు.



# క్రీడల్లో ప్రతిభే.. విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది

### మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన ఎంపీడీవో జమలారెడ్డి
### చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి
### ఎంఈఓ ఎదుసింహరాజు





అరుణ ప్రభ:- బూర్గంపాడు : విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి తగిన ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జమలారెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలను మండల విద్యాశాఖ అధికారి ఎదు సింహరాజు తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జమలారెడ్డి మాట్లాడుతూ చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని అన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపు ఒక్కటే లక్ష్యంగా కాకుండా, క్రీడాస్ఫూర్తితో పాల్గొని తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది విద్యార్థుల్లో మంచి క్రీడా ప్రతిభ ఉన్నప్పటికీ సరైన వేదికలు, ప్రోత్సాహం లేకపోవడంతో వారి ప్రతిభ వెలుగులోకి రావడం లేదన్నారు. మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగేలా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తే భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దవచ్చని ఆయన అన్నారు.

**విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలకు ప్రత్యేక స్థానం**

విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలకు ప్రత్యేక స్థానం ఉందని మండల విద్యాశాఖ అధికారి ఎదుమారాజు అన్నారు. చదువుతో పాటు ప్రతిరోజూ కొంత సమయం క్రీడలకు కేటాయించడం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారికి అవసరమైన శిక్షణ అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వం అలవడుతుందని పేర్కొన్నారు. మండల స్థాయి పోటీల్లో అండర్-17, అండర్-14 విభాగాల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, 100, 200 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హైజంప్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 10, 11 తేదీల్లో జరుగుతున్న పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. సర్పంచ్ బొర్రా సుభద్ర,, ఉప సర్పంచ్ పొక్కుల రవి, రామచంద్రారెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, పీఈటీలు కృష్ణ, బాబూరావు, పూర్ణ, జూనియర్ సుకన్య, నాగలక్ష్మి, పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## పట్టణంలో పలు స్కానింగ్ సెంటర్లు ఆకస్మికతనికి చేసిన డిఎంహెచ్ఓ

అరుణప్రభ మహబూబాబాద్, సెప్టెంబర్.10 : జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్. రవి రాథోడ్ గురువారం మహబూబాబాద్ పట్టణం లోని ప్రైవేట్ స్కానింగ్ ఆసుపత్రు లను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్బంగా వైద్యాధికారి రికార్డులను, గర్భిణీ పరీక్ష స్కానింగ్ మిషన్ పరిశీలించి, గర్భస్త లింగ నిర్ధారణ పరీక్షలు (పీసీపీఎన్ డి టి )చట్ట రీత్యా నేరమని, గర్భస్రవం (అబారషన్) నిర్వహించే ఆసుపత్రి లను తనిఖీ నిర్వహించడం జరిగింది పి సి పి ఎన్ డి టీ యాక్ట్ ప్రకారం చట్టము ఉల్లంగించి నా వారికి 3సంవత్సరాల జైలు శిక్ష మరియు 50,000జరిమానా వేస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో డాక్టర్ వీరజిత, డెమో రాజ్ కుమార్, మనోహర్, అనిల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## తెలంగాణ రెడ్లు ఐక్యంగా ఉండాలి: వట్టిపల్లి రాజిరెడ్డి

### తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం కార్యదర్శి వట్టిపల్లి రాజిరెడ్డి



తెలంగాణ రాష్ట్రంలోని రెడ్డి సమాజం ఐక్యంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం కార్యదర్శి వట్టిపల్లి రాజి రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ స్థాయిలో సంఘాన్ని బలోపేతం చేసి, సమాజ సమస్యలపై సమష్టిగా స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. రెడ్డి సమాజానికి సంబంధించిన అంశాలపై కొందరు వ్యక్తులు చేస్తున్న వ్యాఖ్యల విషయంలో సమాజ సభ్యులు శాంతియుతంగా, చట్టబద్ధంగా స్పందించాలని రాజి రెడ్డి సూచించారు. అభ్యంతరకర వ్యాఖ్యలు ఉంటే సంబంధిత చట్టపరమైన మార్గాలను అనుసరించాలని ఆయన కోరారు. సమాజంలోని యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు తదితర వర్గాలను కలుపుకొని ఐక్యతను పెంపొందించేందుకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సంఘటిత కార్యక్రమాలు చేపట్టాలని ఆయన అన్నారు. రెడ్డి సమాజం అభివృద్ధి, విద్య, ఉపాధి, సామాజిక సంక్షేమం వంటి అంశాలపై కూడా దృష్టి సారించాలని రాజి రెడ్డి పిలుపునిచ్చారు. సమాజ సభ్యులందరూ పరస్పర గౌరవంతో, ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు సాగాలని ఆయన కోరారు.

## నేడు డిండి మండల పరిషత్‌లో

### విబిజి రాంజీ పథకం ప్రణాళికపై సర్పంచుల సమావేశం

అరుణ ప్రభ, దిండి, సెప్టెంబర్ 10,విబి జిరామ్ జి పథకంలో భాగంగా 2026 - 27 గ్రామపంచాయతీ ప్రణాళికల అవగాహన సదస్సును దిండి మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో అవగాహన సమావేశం ఏర్పాటు ఏర్పాటు చేయనైనదని మండల పరిషత్ అధికారి నర్రా వేజన్న ఒక ప్రకటనలో తెలిపారు .ఈ కార్యక్రమము మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన నిర్వహించబడుతుందని, మండలంలోని గౌరవ సర్పంచులు, కార్యదర్శులు సకాలంలో హాజరుకావాలని ఎంపీడీవో తెలిపారు.

## ఎస్ జి ఎఫ్ ఇబ్రహీంపట్నం మండల క్రీడా పోటీలు విజయవంతం ఇబ్రహీంపట్నం ఇంచార్జ్ : పి డి సుశీల

### బహుమతుల ప్రధానోత్సవంలో పాల్గొన్న ఇబ్రహీంపట్నం మున్సిపాల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి

అరుణప్రభ ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి. గత మూడు రోజులుగా జరుగుతున్న ఈ పోటీలలో వాలీబాల్, కో కో కబడ్డీ, పోటీలలో విద్యార్థులు హోరాహోరీగా పోటీపడినారు. ఈ క్రీడ పోటీల్లో కబడ్డీ విభాగంలో ట్రైబల్ వెల్ఫేర్ మొదటి బహుమతి విజ్ఞాన్ హై స్కూల్ ద్వితీయ బహుమతి గర్ల్స్ విభాగంలో గర్ల్స్ హై స్కూల్ మొదటి బహుమతి, జెడ్పిహెచ్ఎస్ రాయపోల్ గెలుపొందినారు.. క్రీడాకారులకు మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడలో కూడా రాణించాలి క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక దృఢత్వానికి ఆరోగ్యానికి దోహద పడతాయి. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు జరగబోయే జోన్ జిల్లా లెవెల్ పోటీలలో ఇబ్రహీంపట్నం మండల్ గెలుపొందాలని ఉత్తమ ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులకు మీ ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.. ఈ కార్యక్రమంలో గురుకుల విద్యాపీట్ ప్రిన్సిపాల్ డి శ్రీనివాసరావు , సీనియర్ ఫిజికల్ డైరెక్టర్స్ విస్లావత్ రాజు, వరలక్ష్మి, రాములు, సుదర్శన్ రెడ్డి ఆంజనేయులు, రాజశేఖర్, వినయ్, మహేష్ ,రాకేష్ శివలింగం, పాష, రమాదేవి, సాగర్, తదితరులు పాల్గొన్నారు.....



## నేడు దిండి లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

అరుణ ప్రభ, డిండి, సెప్టెంబర్ 10,స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఏటా నిర్వహించే క్రీడలలో భాగంగా నేడు అనగా శుక్రవారం దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని దిండి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో క్రీడా పోటీలో నిర్వహించబడతాయని మండల విద్యాధికారి నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14 అండర్ 17 బాల బాలికల విభాగంలో కబడ్డీ ,కోకో, వాలీబాల్ మరియు అథ్లెటిక్స్ లో క్రీడాకారుల ఎంపిక నిర్వహించబడుతుందని ఆయన అన్నారు. ఉదయం 10 గంటల వరకు పాఠశాల క్రీడా మైదానికి క్రీడాకారులు సకాలంలో చేరుకోవాలని, ఈ పోటీలకు మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు క్రీడాకారులను పంపించాలని తెలిపారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లతో సన్నద్ధంగా ఉండాలి

### కేసుల దర్యాప్తు, పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి: ఎస్పీ డా. శబరీష్



అరుణప్రభ 10 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆధ్వర్యంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు, గణేష్ విగ్రహాల ఏర్పాటు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలతో పాటు నేర నియంత్రణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారం, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై ఎస్పీ సమీక్షించారు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాల సంఖ్య, ప్రాంతాలు, నిర్వాహకుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. గణేష్ విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన దరఖాస్తులను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వీకరించి, అనుమతుల ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి విగ్రహం వివరాలను జియో ట్యాగింగ్ చేయడంతో పాటు పోలీస్ స్టేషన్ పరిధిలోని విగ్రహాలపై పూర్తి సమాచారం అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజల రాకపోకలకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే విధంగా ప్రధాన రహదారులను బ్లాక్ చేసి విగ్రహాలను ఏర్పాటు చేయకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు జరగకుండా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మండలంలో ఉన్న గణేష్ నిమజ్జన ప్రాంతాల వివరాలను ముందుగానే సేకరించి, ఆయా ప్రాంతాలను అధికారులు స్వయంగా పరిశీలించాలని ఎస్పీ ఆదేశించారు. నిమజ్జనానికి సరిపడా నీరు ఉందా, వాహనాల రాకపోకలకు అనుకూలంగా ఉందా,



ప్రజల భద్రతకు అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయా అనే అంశాలను పరిశీలించాలని సూచించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదని, నిబంధనలను కఠినంగా అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. నమోదైన ప్రతి కేసులో సమగ్రంగా, శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు చేపట్టి ఆధారాలను పకడ్బందీగా సేకరించాలని ఎస్పీ సూచించారు. కేసుల దర్యాప్తులో జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో దర్యాప్తును పూర్తి చేసి, పెండింగ్ కేసులను సకాలంలో డిస్పోజ్ చేయాలని ఆదేశించారు. దర్యాప్తు నాణ్యతను పెంచి, పక్కా ఆధారాలతో ఛార్జ్‌షీట్లు దాఖలు చేసి, నేరస్తులకు శిక్ష పడేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. జిల్లాలో కన్విక్షన్ రేట్‌ను పెంచే విధంగా దర్యాప్తు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో సీసీటీఎన్ ఎస్ ఆన్‌లైన్ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించాలని, నమోదైన ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఎస్పీ ఆదేశించారు. కేసుల దర్యాప్తులో ఈ సాక్షను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. డిజిటల్ అవర్‌ను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ కేసుల పురోగతిని సమీక్షించాలని, ఛార్జ్‌షీట్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, యు ఐ కేసులు నిర్ణీత సమయంలో పూర్తి అయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. డయల్ 112/100 ద్వారా అందే అత్యవసర కాల్స్‌పై పోలీసులు తక్షణమే స్పందించాలని ఎస్పీ సూచించారు. సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకునే సమయాన్ని (రెస్పాన్స్ టైం ) మరింత తగ్గించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి కాల్‌ను సీరియస్‌గా పరిగణించి, బాధితులకు సకాలంలో పోలీసు సహాయం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. రాత్రి వేళల్లో పోలీసుల గస్తీని మరింత పటిష్టం చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని ఎస్పీ సూచించారు. అధికారులు తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు స్థానిక పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, మోసపూరిత కాల్స్ తదితర సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, గణేష్ ఉత్సవాల సమయంలో పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ఆదేశించారు.

## ఓ మనిషి ఒడిదొడుకులు ఎదురైన ప్రయత్నాన్ని కొనసాగించు

మనిషి జీవితం
సమస్యల వలయం
కోరికలు అనంతం
కోర్కెలు పరస్పర పూరకాలు
కోర్కెలు పోటీపడుతాయి
కోర్కెల సాధనకై
ప్రయత్నిస్తాడు
కోర్కెలు ప్రయత్నం తృప్తి
ఇదే మానవుని జీవిత చక్రం

ఓ మనిషి గమ్యం వైపు నడిచే
దారిలో అడ్డంకులు ఎదురైతే
ఆగిపోవద్దు

నిప్పులు కురిసే దారులైనా
నిన్ను ఆపే శక్తులైనా
శిరస్సు వంచి లొంగిపోకు
నీ సంకల్పాన్ని వదిలిపెట్టకు

ఒడిదొడుకులు ఎదుర్కో
గాయాలే నీకు ఆయుధాలు
ఓటములే నీకు పాఠాలు
సుడిగాలిని ఎదురించే ధైర్యానివై
కొత్త చరిత్రను సృష్టించు

అలలు ఎగసి పడితేనే
సముద్రానికి అందం
పోరాడి సాధిస్తేనే జీవితానికి
సార్థకత

విధి రాసిందని విధికి తలవంచకు
లక్ష్యసాధనలో అడ్డంకులు
ఎదురైన గమ్యాన్ని చేరే వరకు
ప్రయత్నాన్ని ఆపకు

ప్రయత్నం కొనసాగించు

నీ చెమట చుక్కలను
ముత్యంగా మార్చుకో
నీ అడుగులే అభివృద్ధి
పథంగా మార్చుకో
విజయం సాధించేవరకు
శ్రమిస్తూ ముందుకు సాగిపో

నువ్వు నడిచే దారిలో
ముళ్ళు ఎదురైన
అవి నీ పట్టుదలను ఆపలేవు
పడిపోవడం తప్పు కాదు
పడిన ప్రతి సారి ఒక
శిఖరంలాపైకి లేవడమే
అసలైన గెలుపు

ఓ మనిషినీ శ్వాస ఉన్నంత
వరకునీప్రయత్నాన్ని ఆపకు
అపుడే విజయం
నీ సొంతమవుతుంది
అప్పుడే నూతన చరిత్రను
సృష్టించి స్ఫూర్తిగా నిలుస్తావు



**నేదునూరి కనకయ్య**
రచయిత కాలమిస్ట్
హైదరాబాద్
9440245771



## విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు పట్టణంలోని ఎస్. కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కలశాల నందు విద్యార్థులకు ఓటు హక్కు పై ఆర్డీవో అరుణ కుమారి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ అరుణకుమారి మాట్లాడుతూ గత రెండు నెలలుగా సర్ కార్యక్రమం జరిగిందని ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్ పూర్తయిందని అన్నారు నూతన 18 సంవత్సరముల నిండిన వారందరికీ ప్రభుత్వం ఓటు కల్పిస్తుందని ఓటు యొక్క విలువను తెలియజేస్తూ కళాశాలలో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం డి ఆర్. డబ్ల్యూ కళాశాలలో సర్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, తాసిల్దార్ ప్రసాద్, ఎస్. కె.ఆర్ ప్రిన్సిపాల్ రామ్ ప్రసాద్ , డి.ఆర్. డబ్ల్యూ కలశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు ,తదితరులు పాల్గొన్నారు.



## డి. ఆర్. డబ్ల్యూ లో ఇంటర్వ్యూలు

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు పట్టణంలోని డిఆర్ కలశాల లో లక్ష్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ లు నిర్వహించారు. ఈ సందర్భంగా కలశాల ప్రిన్సిపాల్ హనుమంత రావు మాట్లాడుతూ 250 మంది విద్యార్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నారని , 115 మంది వివిధ కంపెనీలకు ఎంపికైనారన్నారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గాయత్రి, ప్లేస్ మెంట్ అధికారి రాధ , తదితరులు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : ఎస్ఐ, కానిస్టేబుల్‌తో పాటు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12న శనివారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని లహరి బ్రాంకెట్ హాల్‌లో శనివారం ఉదయం 8:30 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని, ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎస్పీ సూచించారు. పోటీ పరీక్షలకు సమర్థవంతంగా సన్నద్ధమయ్యేందుకు అవసరమైన పలు అంశాలపై సదస్సులో నిపుణులు అవగాహన కల్పించనున్నారు. ముఖ్యంగా స్ట్రెస్ మేనేజ్‌మెంట్, సబ్జెక్టుల వారీగా నిపుణుల శిక్షణ, పరీక్షల విధానం, సమయపాలన, పరీక్షలకు సన్నద్ధమయ్యే విధానం తదితర అంశాలపై అభ్యర్థులకు ముఖ్యమైన సూచనలు అందించనున్నారు. జిల్లా పోలీస్ శాఖ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎస్పీ మహేష్ బి. గితే ఆకాంక్షించారు. పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి విజయాన్ని అందుకోవాలని ఆయన అభ్యర్థులకు శు భాకాంక్షలు తెలిపారు.

## చేనేత పెన్షన్లకు అర్హులందరికీ న్యాయం



ధర్మవరం, సెప్టెంబర్ 10; (అరుణ ప్రభ న్యూస్) : మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ సూచన మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు ధర్మవరం మార్కెట్‌యార్డులోని హ్యాండ్లూమ్ కార్యాలయాన్ని సందర్శించారు. కొత్తగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు దరఖాస్తు చేసుకునే చేనేత కార్మికులకు అవసరమైన హ్యాండ్లూమ్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి పింఛన్ అందేలా అధికారులు చొరవ తీసుకోవాలని హరీష్ బాబు సూచించారు. సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, వెరిఫికేషన్ పూర్తి చేసి సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆదేశించారు. దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా ప్రక్రియను సులభతరం చేయాలని, ప్రతి దరఖాస్తుదారుడికి అక్నాలెడ్జ్‌మెంట్ తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. సర్టిఫికెట్ జారీ నుంచి పింఛన్ మంజూరు వరకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని చర్యలు చేపడతామని హరీష్ బాబు తెలిపారు.

## మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహన నిందితుల అరెస్ట్

### ఎస్‌హెచ్ఓ : జలంధర్ రెడ్డి సిబ్బందిని అభినందించారు



సెప్టెంబర్ 10,అరుణ ప్రభ : మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు ద్విచక్ర వాహనాల దొంగతనం కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్ట్ దొంగిలించబడిన ద్విచక్ర వాహనాలు స్వాధీనం, 10.09.2026న మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులపై దర్యాప్తు చేపట్టిన మేడిపల్లి పోలీసులు ఇద్దరు నిందితులను పట్టుకుని అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలు : వి. విజేందర్ ఏ రాజేంద్ర, తండ్రి లేట్ రామస్వామి, వయస్సు 30 సంవత్సరాలు, వృత్తి కూరగాయల వ్యాపారం,శ్రీపుర్ కాలనీ, పీర్జాదిగూడ మరొకరు బసంత్ ముదు, తండ్రి రామచంద్ర, వయస్సు 22 సంవత్సరాలు, వృత్తి లేబర్ కులం కుమ్మరి, తుక్కుగూడ, సొంత ఊరు బాలు గాం, చిత్రాపూర్ పోస్ట్, గంజాం జిల్లా, ఒడిశా రాష్ట్రం. దర్యాప్తులో పై నిందితులు ఆరు ద్విచక్ర వాహనాల దొంగతనం కేసుల్లో పాల్గొన్నట్లు వెల్లడైంది. నిందితుల నుండి మొత్తం 06 దొంగిలించబడిన ద్విచక్ర వాహనాలను, సుమారు రూ.4,20,000/- విలువైన వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రికవరీ చేసిన వాహనాల వివరాలు1). 02 హోండా యాక్టివా స్కూటర్లు,2). 01 హీరో స్ప్లెండర్ మోటార్ సైకిల్ 3). 01 హీరో ప్యాషన్ మోటార్ సైకిల్ 4). 01 హోండా షైన్ మోటార్ సైకిల్ 5). 01 జావా మోటార్ సైకిల్,6) ద్విచక్ర వాహనాలు రికవరీ విలువ: సుమారు రూ.4,20,000/-నిందితులను అరెస్ట్ చేసి, గౌరవ న్యాయస్థానంలో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగింది.కేసులను సమర్థవంతంగా దర్యాప్తు చేసి, నిందితులను పట్టుకోవడంతో పాటు దొంగిలించబడిన 06 ద్విచక్ర వాహనాలను రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన మేడిపల్లి క్రైమ్ టీమ్ సిబ్బందిని మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ జలంధర్ రెడ్డి అభినందించారు.ప్రజలకు మేడిపల్లి పోలీసుల విజ్ఞప్తి మేరకు ప్రజలు తమ ద్విచక్ర వాహనాలను పార్క్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనాలను సురక్షితంగా లాక్ చేయాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు లేదా వాహన దొంగతనం జరిగినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని మేడిపల్లి పోలీసులు కోరారు.

## ఢిల్లీలో ఒకేరోజు.. బ్రిక్స్ సదస్సుకు వీవీఐపీల కాన్వాయ్‌లు, టీ20 కోసం 35,000 మంది ఫ్యాన్స్

**ఢిల్లీలో ఒకేరోజు బ్రిక్స్ సదస్సు, భారత్-ఆఫ్ఘన్ ు20 మ్యాచ్**

**భద్రతా కారణాలతో మ్యాచ్‌ను వాయిదా వేయాలని కోరిన పోలీసులు**

**సుమారు 35,000 మంది అభిమానులు వస్తారని అంచనా**

**చర్చల తర్వాత మ్యాచ్ యథాతథంగా జరుగుతుందని డీడీసీఏ స్పష్టత**

**ట్రాఫిక్, భద్రతా నిర్వహణ ఢిల్లీ పోలీసులకు పెను సవాల్**




ఢిల్లీలో ఒకేరోజు రెండు కీలక కార్యక్రమాలు జరగనుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అంతర్జాతీయ బ్రిక్స్ సదస్సు ముగింపు రోజైన సెప్టెంబర్ 13వ తేదీనే, అరుణ్ జైట్లీ స్టేడియంలో భారత్–ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య తొలి టీ20 మ్యాచ్‌ను యథాతథంగా నిర్వహించనున్నట్లు ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) ప్రకటించింది. ఈ పరిణామంతో దేశ రాజధానిలో భద్రతను పర్యవేక్షించడం, ట్రాఫిక్ నియంత్రించడం ఢిల్లీ పోలీసులకు పెను సవాలుగా మారింది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీ వేదికగా బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు విచ్చేసే విదేశీ ప్రతినిధులు, వీవీఐపీల భద్రతతో పాటు వారి కాన్వాయ్‌ల రాకపోకల కోసం ట్రాఫిక్ పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాటు చేస్తున్నారు. ఇదే సమయంలో, సెప్టెంబర్ 13న జరిగే క్రికెట్ మ్యాచ్‌కు దాదాపు 25,000 నుండి 35,000 మంది ప్రేక్షకులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఒకేసారి రెండు ప్రధాన కార్యక్రమాలు కావడంతో నగరంలోని డీడీయూ మార్గ్, బీఎస్‌జడ్ మార్గ్, మింటో రోడ్ వంటి కీలక ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు బలగాల్లో అత్యధిక శాతం బ్రిక్స్ సదస్సు బందోబస్తులోనే నిమగ్నమై ఉన్నందున, మ్యాచ్‌ను వాయిదా వేయాలని లేదా ఇతర తేదీలకు మార్చాలని డీడీసీఏని పోలీసులు కోరారు. అయితే, ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులతో జరిపిన చర్చల అనంతరం, మ్యాచ్ నిర్వహణకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ లభించిందని డీడీసీఏ వెల్లడించింది. దీంతో షెడ్యూల్ ప్రకారం మ్యాచ్ నిర్వహణకే మొగ్గు చూపినట్లు స్పష్టం చేసింది. ఈ సిరీస్‌లో భాగంగా భారత్, ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో మూడు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఒకేవైపు వీవీఐపీల భద్రత, మరోవైపు వేలాది మంది అభిమానుల రద్దీ నియంత్రణను ఢిల్లీ యంత్రాంగం ఏ విధంగా సమన్వయం చేస్తుందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# ఇకపై క్రెడిట్ స్కోర్ లోన్లకే కాదు.. ఉద్యోగం రావాలన్నా మీ స్కోర్ బాగుండాల్సిందే!




ప్రస్తుత రోజుల్లో క్రెడిట్ స్కోర్ అనేది కీలకమైన విషయం. బ్యాంకుల్లో ఏదైనా లోన్ తీ ు ం ర ో వ డా ని ర ి ప్రయత్నించినప్పుడు మొదట అడిగే ప్రశ్న మీ సిబిల్ స్కోర్ ఎంతా? అని. మంచి స్కోర్ ఉన్న వారికే బ్యాంకులు లోన్ ఇచ్చేందుకు ఇష్టపడతాయి. అయితే, ఇకపై క్రెడిట్ స్కోర్ అనేది రుణాలకే పరిమిత్ కాదు, ఇక ఉద్యోగం రావాలన్నా మీ సిబిస్ స్కోర్ బాగుండాల్సిందే. మరి అందుకు గల కారణాలను తెలుసుకుందాం. మీరు ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నారా? అయితే మీ విద్యార్హతలు, పని అనుభవంతో పాటు మీ క్రెడిట్ స్కోర్ సైతం సరిగ్గా ఉందో లేదో చూసుకోండి. ఎందుకంటే, ఇప్పుడు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు అభ్యర్థులను ఎంపిక చేసేటప్పుడు వారి ఆర్థిక క్రమశిక్షణను కూడా ఒక ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. మీరు గతంలో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించారా లేదా అనే అంశం మీకు ఉద్యోగం వచ్చే అవకాశాలను ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంలో ప్రస్తుత నియామక ప్రక్రియలో అభ్యర్థుల రీపేమెంట్ హిస్టరీ ఇప్పుడు కీలక పాత్ర పోషిస్తోంది. అంటే రుణాలకే కాదు ఉద్యోగం సాధించాలన్నా మంచి క్రెడిట్ స్కోర్ ఉండాలని గుర్తుంచుకోవాలి.

**ఉద్యోగానికి క్రెడిట్ స్కోర్ పాత్ర**

బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగంలో పారదర్శకతను పెంచేందుకు ఇప్పుడు అభ్యర్థుల క్రెడిట్ రిపోర్టులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. బ్యాంకు ఉద్యోగులు ప్రతిరోజూ నగదు లావాదేవీలు, కస్టమర్ల రహస్య సమాచారంతో పనిచేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఉద్యోగి వ్యక్తిగత జీవితంలో భారీ అప్పుల్లో ఉండడం, వాటిని తీర్చలేక ఒత్తిడిని ఎదుర్కోవడం వంటివి జరిగినట్లయితే అది పని చేస్తున్న కంపెనీ పట్ల అంకితభావం తగ్గడానికి లేదా అక్రమాలకు పాల్పడేందుకు దారితీయవచ్చని భావిస్తున్నారు. అందుకే, అభ్యర్థి ఆర్థికంగా ఎంత బాధ్యతాయుతంగా ఉన్నారో తెలుసుకునేందుకు క్రెడిట్ స్కోర్‌ను ఒక కొలమానంగా ఉపయోగిస్తున్నారు. అభ్యర్థిని ఎంపిక చేసే ముందే వారి అనుమతితో బ్యాంకులు క్రెడిట్ స్కోరును క్రెడిట్ బ్యూరోల నుంచి సేకరిస్తాయి. లోన్ డిఫాల్ట్ అవ్వడం, భారీగా క్రెడిట్ కార్డ్ బకాయిలు కలిగి ఉండడం లేదా రైట్ ఆఫ్ అయిన లోన్లు ఉండటం వంటివి అభ్యర్థిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. కొన్ని సందర్భాల్లో కేవలం కొత్త నియామకాలకే కాకుండా అంతర్గత పదోన్నతులు ఇచ్చేటప్పుడు సైతం క్రెడిట్ హిస్టరీని లెక్కలోకి తీసుకుంటున్నారు.

**ఉద్యోగార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

ఒకవేళ మీ క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉంటే దాన్ని మెరుగుపరుచుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలను దక్కించుకోవచ్చు. పాత లోన్లు లేదా క్రెడిట్ కార్డ్ బకాయిలు ఉన్నట్లయితే వెంటనే క్లియర్ చేయడం మంచిది. క్రెడిట్ రిపోర్టులో ఏవైనా తప్పులు ఉంటే వాటిని వెంటనే సరిదిద్దుకోవాలి. ఈఎంఐ (జువీ×)లు సకాలంలో చెల్లించడం వల్ల మీ స్కోర్ పెరుగుతుంది, ఇది ఇంటర్వ్యూ సమయంలో మీ బాధ్యతాయుత ప్రవర్తనకు నిదర్శనంగా నిలుస్తుంది. టెక్నాలజీ యుగంలో మీ ప్రతి ఆర్థిక అడుగు రికార్డ్ అవుతోంది. కాబట్టి, కేవలం లోన్ల కోసమే కాకుండా మీ కలల ఉద్యోగాన్ని సాధించడానికి కూడా మంచి క్రెడిట్ స్కోర్‌ను మెయింటెన్ చేయడం ఇప్పుడు అనివార్యంగా మారింది.

## ఉద్యోగం పోతే వెంటనే వెనక్కి.. భారతీయ టెకీలను టార్గెట్ చేసిన కొత్త రూల్?




అమెరికాలో హెచ్-1బీ వంటి తాత్కాలిక వీసాలపై పనిచేస్తున్న విదేశీ ఉద్యోగులకు ట్రంప్ సర్కార్ షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఉద్యోగం కోల్పోయిన తర్వాత కొత్త ఉద్యోగం వెతుక్కోవడానికి లేదా దేశం విడిచి వెళ్లేందుకు సన్నద్ధమవడానికి ప్రస్తుతం ఇస్తున్న 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను రద్దు చేయాలని ప్రతిపాదించింది. ఇది అమల్లోకి వస్తే, ఉద్యోగం పోయిన మరుసటి రోజే దేశం విడిచి వెళ్లాల్సి వస్తుంది. హెచ్-1బీ వీసాదారుల్లో అధిక శాతం భారతీయ టెకీలే కావడంతో ఈ ప్రతిపాదన వారిలో ఆందోళన రేపుతోంది. అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్ఎస్) ఈ మేరకు ఫెడరల్ రిజిస్టర్‌లో గురువారం ఒక ప్రకటన చేసింది. ఈ ప్రతిపాదన శుక్రవారం అధికారికంగా ప్రచురితమై, 60 రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణకు అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం ఉన్న నిబంధన ప్రకారం, ఉద్యోగం కోల్పోయిన హెచ్-1బీ, ఎల్-1, ఓ-1, ఈ-1 వంటి వీసాదారులు 60 రోజుల్లోపు మరో స్పాన్సర్‌ను వెతుక్కోవచ్చు లేదా తమ వ్యవహారాలు చక్కబెట్టుకోవచ్చు. ఒబామా హయాంలో 2017లో ఈ వెసులుబాటును కల్పించారు. అయితే, ఈ గ్రేస్ పీరియడ్ వల్ల పరిపాలనా భారం పెరుగుతోందని, వీసా స్టేటస్‌ను నేరుగా ఉద్యోగంతో ముడిపెట్టడం ద్వారా అమెరికన్లకు అవకాశాలు పెరుగుతాయని డీహెచ్ఎస్ తన ప్రతిపాదనలో పేర్కొంది. ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన తర్వాతే దీనిపై తుది నిర్ణయం వెలువడుతుంది. అప్పటివరకు ప్రస్తుతం ఉన్న 60 రోజుల గ్రేస్ పీరియడ్ నిబంధనే అమల్లో ఉంటుంది.

## గృహ వినియోగానికి 10 కేజీల సిలిండర్లు.. కేంద్రం.. ఏం చెప్పిందంటే?



పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలతో మన దేశంలో ఎల్‌పీజీ గ్యాస్ కొరత ఏర్పడింది. దీంతో గృహ వినియోగానికి ప్రాధాన్యం ఇచ్చిన చమురు మార్కెటింగ్ కంపెనీలు సరికొత్త వ్యూహాన్ని ఆలోచిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఇందులో భాగంగా 10 కిలోల ఎల్‌పీజీ సిలిండర్లను తీసుకురావాలని ఆలోచిస్తున్నట్లు జాతీయ మీడియా సంస్థలు పేర్కొన్నాయి. అయితే, ఈ విషయంపై కేంద్రం స్పందించింది. అవి పూర్తిగా అవాస్తవమని, అలాంటి ఆలోచన ఏదీ లేదని క్లారిటీ ఇచ్చింది. ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ బరువును 14.2 కిలోల నుంచి 10 కిలోలకు తగ్గించి సరఫరాను పెంచాలని చమురు మార్కెటింగ్ కంపెనీలు కొత్త ఆలోచన చేస్తున్నట్లు జాతీయ మీడియాల్లో వార్తలు వచ్చాయి. అయితే, ఈ వార్తలపై తాజాగా కేంద్ర ప్రభుత్వం స్పందించింది. అవన్నీ ఊహాగానాలే అంటూ కొట్టిపారేసింది. ఈ మేరకు పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వివరణ ఇచ్చారు. అలాంటి వార్తలను నమ్మవద్దని, వాటిల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు మీడియా సమావేశంలో క్లారిటీ ఇచ్చారు. 'ఇది పూర్తిగా ఊహాజనితమైనది, ఏ ఊహాగానంపైనా మాట్లాడేందుకు, వివరణ ఇచ్చేందుకు సాధ్యపడదు. అలాంటి వదంతులను నమ్మవద్దు' అని పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మినిస్ట్రీకి చెందిన మార్కెటింగ్, ఆయిల్ రిఫైనరీ విభాగం జాయింట్ సెక్రెటరీ సుజాత శర్మ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తత నేపథ్యంలో ఏర్పడిన వంట గ్యాస్ కొరతను అధిగమించేందుకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సిలిండర్ బరువును తగ్గించే యోచనలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి.

# ఉద్యోగులూ కొత్త రూల్స్ తెలుసా.. రెంట్ లక్ష దాటితే 200 శాతం పెనాల్టీ!



ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చే ఉద్యోగులకు బిగ్ అలర్ట్. పాత పన్ను విధానంలో ఉండి హెచ్ఆర్ఏ మినహాయింపు క్లెయిమ్ చేస్తుంటే ఏప్రిల్ 1 నుంచి వచ్చే కొత్త రూల్స్ కచ్చితంగా తెలుసుకోవాలి. నాలుగు ప్రధానమైన మార్పులు వస్తున్నాయి. రూ.1 లక్ష దాటి రెంట్ చెల్లిస్తే యజమాని పాన్ తప్పనిసరి, ఏవైనా విషయాలు దాస్తే 200 శాతం పెనాల్టీ కట్టాల్సి వస్తుంది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం. ఆదాయపు పన్నులకు సంబంధించి కొత్త ఆర్థిక సంవత్సరంలో కొత్త రూల్స్ అమలులోకి వస్తున్నాయి. ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్ 2025, ఇన్‌కమ్ ట్యాక్స్ రూల్స్ 2026 అనేవి ఏప్రిల్ 1 నుంచి అమలవుతున్నాయి. ఈ క్రమంలో ఉద్యోగులపై నేరుగా ప్రభావం చూపించే చాలా నిబంధనలు ఇందులో ఉన్నాయి. ముఖ్యంగా పాత పన్ను విధానం ఎంచుకుని పన్ను మినహాయింపులు పొందే వారు అప్రమత్తంగా ఉండాలి. ఆదాయపు పన్ను మినహాయింపుల్లో హౌస్ రెంట్ అలవెన్స్ (ఎ=ూ) కీలకమైనది. ఈ హెచ్ఆర్ఏకు సంబంధించి రూల్స్ మారాయి. వచ్చే నెల నుంచి హెచ్ఆర్ఏ క్లెయిమ్‌కి సంబంధించి 4 అంశాల్లో కొత్త నిబంధనలు అమలవుతున్నాయి. మరి ఆ వివరాలు ఇప్పుడు మనం తెలుసుకుందాం. చాలా మంది ఉద్యోగులకు తమ తల్లిదండ్రులు లేదా జీవిత భాగస్వామికి ఇంటి అద్దె చెల్లించి హెచ్ఆర్ఏ మినహాయింపులు క్లెయిమ్ చేస్తుంటారు. ఇలాంటి వారు ఇకపై తమ ఇంటి యజమానితో ఉన్న సంబంధాన్ని తెలియజేయాల్సి ఉంటుంది. ఫేక్ రెంట్ అగ్రిమెంట్లను నిరోధించేందుకు ఈ కొత్త రూల్ తీసుకొచ్చారు. ఇది కట్టుడు పళ్ల కంటే 300 రెట్లు ఉత్తమం! మరియు ధర చాలా చౌకగా ఉంటుంది డబుల్, ట్రిపుల్ బెడ్ రూమ్ రెంటు ఏడాదికి రూ. 1 లక్ష పైన ఉంటుంది. ఇలాంటి ఏడాదికి రూ.1 లక్ష రెంటు దాటే సందర్భంలో ట్యాక్స్ పేయర్లు తమ ఇంటి యజమాని పాన్ కార్డు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. వారు తమ ఐటీఆర్‌లో రెంటల్ ఇన్‌కమ్ వెల్లడించాలి. లేదంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కొన్నిసార్లు తప్పుడు హెచ్ఆర్ఏ క్లెయిమ్స్ చేస్తుంటారు. ఇలాంటి వాటికి సెక్షన్ 270ఏ (ావష్ఱశీఅ 270ూ) వర్తిస్తుంది. ఇలా తప్పుడు క్లెయిమ్స్ చేసినట్లు గుర్తిస్తే పన్ను బకాయిలపై 50 శాతం నుంచి 200 శాతం వరకు పెనాల్టీ కట్టాల్సి రావచ్చు. ఇంటి యజమానికి రికార్డులతో క్రాస్ చెక్ చేస్తారు. హెచ్ఆర్ఏ నిబంధనలు మార్చిన క్రమంలో పలు అలవెన్సులను పెంచారు. పిల్లల ఎడ్యుకేషన్ అలవెన్సులను ఒక్కో చిన్నారికి నెలకు రూ. 100 నుంచి రూ. 3000లకు పెంచారు. హాస్టల్ అలవెన్సులు నెలకు రూ. 300 నుంచి రూ. 9000లకు పెంచారు. ఈ విషయంలో ఉద్యోగులకు ఇది శుభవార్త. పెద్ద మొత్తంలో అలవెన్సులు క్లెయిమ్ చేసుకోవచ్చు. ట్యాక్స్ పరిధిలోకి వచ్చే ఉద్యోగి ఈ కొత్త హెచ్ఆర్ఏ రూల్స్ తెలుసుకుని, సరైన అవగాహనతో ఐటీ రిటర్నులు ఫైల్ చేయాల్సి ఉంటుంది.



## వైద్యానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డుకావొద్దు

### రూ.1.21 లక్షల సీఎంఆర్ఎఫ్ సహాయం అందజేసిన మంత్రి సత్యకుమార్

ధర్మవరం, సెప్టెంబర్ 10; (అరుణ ప్రభ న్యూస్) : ఆర్థిక ఇబ్బందుల కారణంగా పేద కుటుంబాలకు వైద్య చికిత్సలో ఆటంకం కలగకూడదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు. ధర్మవరం పట్టణంలోని యాదవ వీధికి చెందిన వల్లంసెట్టి వెంకట్ దీక్షిత్ సర్వైకల్ మైలోపతి వ్యాధితో బాధపడుతున్నారు. చికిత్సకు అయ్యే ఖర్చును భరించే స్థోమత లేక కుటుంబ సభ్యులు మంత్రి సత్యకుమార్‌ను ఆశ్రయించారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి, తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థలో చికిత్సకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందేలా చర్యలు చేపట్టారు. మంత్రి చొరవతో రూ.1,21,427 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి లెటర్ ఆఫ్ క్రెడిట్ మంజూరైంది. దీనిని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్వయంగా వెంకట్ దీక్షిత్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని అన్నారు. ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు అత్యవసర వైద్య సహాయం అవసరమైనప్పుడు తన దృష్టికి తీసుకువస్తే, సాధ్యమైనంత వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కష్ట సమయంలో తమకు అండగా నిలిచి, చికిత్సకు ఆర్థిక సహాయం అందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వెంకట్ దీక్షిత్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## చాకలి ఐలమ్మ 41వ వర్థంతి సందర్భంగా ఘన నివాళులు

అరుణప్రభ ఇబ్రహీంపట్నం : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరవనిత, భూమి కోసం--భుక్తి కోసం--వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన పోరాటానికి స్ఫూర్తినిచ్చిన చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని ఆమె విగ్రహనికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి బోడ సామెల్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని తెలిపారు. తన భూమిని కాపాడుకోవడంతో పాటు అణగారిన ప్రజల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం తెలంగాణ ప్రజల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు, పేదలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. నేటి తరానికి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సిహెచ్ బుగ్గరాములు, జిల్లా కమిటీ సభ్యులు జగన్ పోల్కంపల్లి, రజక సంఘం నాయకులు ముదిగొండ అజయ్, సిపిఎం నాయకులు ముసలయ్య, ఆనంద్, యాదగిరి, విజయ్, రాఘవేందర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు.



## మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు తప్పవు!

### డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించిన బూర్గంపాడు పోలీసులు

బూర్గంపాడు మండలం సారపాక డ్రంక్ అండ్ డ్రైవ్‌ను అరికట్టడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్ ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతపై పలు కీలక సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. వాహనానికి సంబంధించిన ఆర్సీ, ఇన్సూరెన్స్ తదితర అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలి. వాహనం నడిపే ప్రతి ఒక్కరి వద్ద చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. ద్విచక్ర వాహనాలను అతివేగంగా నడపకుండా నిర్ణీత వేగంతో ప్రయాణించాలి. ప్రతి వాహనానికి ముందు, వెనుక నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలి. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపకూడదు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మీ భద్రతే మీ కుటుంబానికి భరోసా... ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించండి అని ఎస్ఐ మేడా ప్రసాద్ వాహనదారులకు సూచించారు.

# అమెరికాలోని ఈ బీచ్ స్పెషాలిటీ ఏంటంటే..



'నార్వేలోని నార్తర్న్ లైట్స్' ఆకాశంలోని అద్భుతమైతే.. ఫ్లోరిడా రాష్ట్రంలోని 'క్లియర్ వాటర్ బీచ్' భూమ్మీది మహాద్భుతంగా నిలుస్తుంది. కనుచూపు మేర నీలం, ఆకుపచ్చ వర్ణాల్లో మెరిసిపోతూ.. అక్కడి సముద్రతీరం అబ్బుర పరుస్తుంది. పాల నురగల్లాంటి అలలు.. నిశ్చలంగా సవ్వడి చేస్తుంటే, బీచ్ నిండా మెరిసే తెల్లటి ఇసుక.. పర్యాటకుల మనసులు దోచేస్తుంది.

అమెరికా, ఫ్లోరిడా రాష్ట్రంలోని టాంపా డౌన్‌టౌన్ నుంచి 40 కి.మీ. దూరంలో ఉంటుంది క్లియర్ వాటర్ బీచ్. టాంపా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 30 కి.మీ. ప్రయాణిస్తే ఈ బీచ్‌కు చేరుకోవచ్చు. ఫ్లోరిడా తీరంలో నాలుగు మైళ్ల దాకా బీచ్ అందాలు కనువిందు చేస్తాయి. ఇక్కడి ఇసుక తెల్లని మంచులా మృదువుగా ఉంటుంది. ఈ ఇసుకలో ఎంతసేపు ఆడినా.. అలసట అనిపించదు. సముద్రంలోని నీళ్లు.. నీలం, ఆకుపచ్చ వర్ణాల్లో ప్రకాశిస్తూ.. పర్యాటకుల మనసులను దోచేస్తాయి. ఆ నీటిలో మునకలేస్తూ ఉంటే.. సమయమే తెలియదు.

### సూర్యాస్తమయం చూడాల్సిందే

క్లియర్ వాటర్ బీచ్‌లోని మరో విశేషం.. ఇక్కడి సూర్యాస్తమయం. అప్పటిదాకా నీలం, ఆకుపచ్చ రంగుల్లో కనువిందు చేసే సముద్రం.. సాయంసంధ్యలో భానుడి కిరణాలు పడి స్వర్ణ వర్ణంలోకి మారిపోతుంది. ఆకాశంలోని మబ్బులు ఎరుపు, పసుపు రంగులమిళితమై అద్భుతంగా కనిపిస్తాయి. సూర్యోదయంలోనూ దాదాపు ఇలాంటి వాతావరణమే ఉంటుంది.

### ఆటలు.. అద్భుతాలు

ఇక్కడికి వచ్చేవారంతా సన్‌బాత్, స్విమ్మింగ్ చేస్తూ కాలాన్ని మరచిపోతారు. వాటర్ గేమ్స్‌కు ఈ బీచ్ పెట్టింది పేరు. పారా సెయిలింగ్, జెట్ స్కీలు, బోటు షికార్లు.. పర్యాటకులకు వినోదాన్ని పంచుతాయి. స్వచ్ఛమైన నీటిలో బోటు విహారంచేస్తూ డాల్ఫిన్లను చూడటం.. ఓ మంచి అనుభూతి. ఆక్వా మ్యూజియం, అలిగేటర్ -వైల్డ్‌లైఫ్ మ్యూజియంలోకి అడుగుపెడితే.. సముద్రజీవుల ప్రపంచమంతా కండ్ల ముందు కదలాడుతుంది.

### ర్యాంకుల పంట..

ర్యాంకింగ్‌ల ప్రకారం.. అమెరికాలోని టాప్-25 బీచ్‌లలో అత్యధికం ఫ్లోరిడాలోనే ఉన్నాయి. తర్వాత స్థానం హవాయిది. యునైటెడ్ స్టేట్స్‌లోని అత్యుత్తమ బీచ్‌లలో ప్రముఖమైంది.. క్లియర్ వాటర్ బీచ్. అంతేకాకుండా, 'ట్రిప్ అడ్వైజర్' ర్యాంకింగ్‌లలో ప్రపంచంలోని ఆరో ఉత్తమ బీచ్‌గానూ నిలిచింది. మేం టాంపాలో ఉన్నపుడు ఈ బీచ్‌ను సందర్శించాం. మాటలకు అందని అనుభూతులను మదిలో నింపుకొన్నాం. జీవిత పర్యంతం నెమరు వేసుకునే జ్ఞాపకాలతో వెనుదిరిగాం. సముద్ర దర్శనం ప్రతిసారీ కొత్తగానే అనిపిస్తుంది. ఓ కొత్త మిత్రుడితో సంభాషిస్తున్న భావన కలుగుతుంది. ఫ్లోరిడా బీచ్ నా సరికొత్త నేస్తం!

### విందులు.. వినోదాలు

ప్రపంచ పర్యాటకుల స్వర్గధామం.. క్లియర్ వాటర్ బీచ్. నిత్యం వేలసంఖ్యలో ఈ బీచ్‌ను సందర్శిస్తుంటారు. వారాంతాల్లోనైతే.. ఇసుకేస్తే రాలనంత జనంతో బీచ్ నిండిపోతుంది. అద్భుతమైన సముద్రం ఓవైపు, విందులు, వినోదాలు మరోవైపు.. ఈ బీచ్ పర్యటనను మరో స్థాయికి తీసుకెళ్తాయి. బీచ్ పక్కనే చాలా రెస్టారెంట్లు ఉన్నాయి. పసందైన వంటకాలతో పర్యాటకులను ఆహ్వానిస్తుంటాయి. షాపింగ్ ఇష్టపడేవారికైతే పండుగే! బీచ్ పొడవునా.. రకరకాల నగల షాపులు, బహుమతుల దుకాణాలు.. ఎన్నో కొలువుదీరి కనిపిస్తాయి. ఇక్కడి వీధి ప్రదర్శనలు, సంగీత కార్యక్రమాలు ప్రతి ఒక్కరినీ అలరిస్తాయి. స్థానిక కళాకారులు రూపొందించిన వస్తువులతో రాత్రిపూట ఏర్పాటు చేసే 'ఎగ్జిబిషన్' మరో విశేషం. ప్రతి వస్తువూ కొనాలని పించేలా ఉంటుంది.





## నల్లమలలో టైగర్ సఫారీ.. ఔత్సాహికులకు సర్కారు సరికొత్త ప్యాకేజీ..



నల్లమల అడువుల్లో ఓ రోజు తిరగాలనుకుంటున్నారా?.. పులులను దగ్గరినుంచి చూడాలనుకుంటున్నారా?.. ఆ దండకారణ్యంలోని చెట్టు, పుట్ట వివరాలు తెలుసుకోవాలనుకుంటున్నారా?.. సరదాగా కుటుంబ కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్‌తో కలిసి ట్రెక్కింగ్ చేయాలనుకుంటున్నారా?.. అయితే, మీలాంటి వారికోసమే సర్కారు సరికొత్త ప్యాకేజీతో ముందుకొచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో వైల్ట్ లైఫ్ టూర్‌కు అవకాశం కల్పించింది. ఈ నెల 17 నుంచీ టైగర్ సఫారీ మొదలుపెట్టబోతున్నది.. మరి ఈ ప్యాకేజీ వివరాలేంటి..? ఎంత మంది వెళ్లొచ్చు..? ఎంత మొత్తం చెల్లించాలి? ఎలా బుకింగ్ చేసుకోవాలి..?

## ప్రకృతి ఒడిలో పరవశింపజేసే.. హొగెనక్కల్ ఫాల్స్



ఆకాశం నుండి దూకుతున్నట్లుండే జల తరంగాల హొరు. మనసును పరవశింపచేసే ప్రకృతి అందాల జోరు. ఆధునిక ప్రపంచానికి సుదూరంగా, సహజత్వానికి చేరువగా ఉండి చూపరులను కళ్ళు చెదిరే తన్మయత్వానికి గురిచేసే అందా ల జలపాతం హొగెనక్కల్. దగ్గరకు వెళ్ళేవరకు ఆనవాలు కూడా కనిపించని ఈ జలపాతానికి కి.మీ. దూరంనుండే ఝుమ్మనే శబ్దం వినిపిస్తుంది. దగ్గరికీ వెళ్లాక మనల్ని మనమే మర్చిపోతాం. భారతీయ నయాగరా జలపాతంగా పిలిచే ఈ జలపాతం అందాలను వానాకాలంలో చూసిన వారెవ్వరైనా ఆనందంతో తడిసిముద్దయిపోతారు. ఈ వానకాలం తప్పకుండా సందర్శించాల్సిన అందాల విడిది హొగెనక్కల్ వాటర్ పాల్స్ మీకోసం. హొగెనక్కల్ జలపాతం కావేరీ నది ప్రాంతంలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడింది.. ఇది తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లాలో ఉంటుంది. బెంగళూరు నుండి 180 కిలోమీటర్లు, ధర్మపురి నుండి 46 కిలోమీటర్లు దూరం లో ఉంటుంది. కార్బొనటైట్ రాళ్ళు దక్షిణాసియాలో, ప్రపంచంలోనే పురాతనమైనవిగా భావిస్తారు. ఆకాశం నుండి దూకుతున్నట్లుండే జలపాతం అమితానందాన్నిచ్చే అనుభూతుల నిలయం. వానకాలంలో ఈ జలపాతం అందాలను చూడడానికి వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. జలపాతం నుండి జాలువారే నీరు రాళ్ళమీద పడినప్పుడు లేచిన నీటి తుంపర్లు పొగలాగా కనిపిస్తుంటుంది. కన్నడంలో హొగె అనగా పొగ, కల్ అంటే రాయి కలిపి హొగెనక్కల్ అంటే పొగలు చిమ్మే రాయి లేదా మంచు తుంపరల నుండి వచ్చే శబ్దం అని అర్థం.

నిజానికి ఇక్కడ ఉన్నది ఒక జలపాతం కాదు. అనేక జలపాతాలు ఉన్నాయి. ఇవన్నీ 250 మీటర్ల ఎత్తు నుండి భూమి మీదకు దూకుతుంటాయి. వర్షపు నీరు కొండ వాలులో ప్రయాణించి హొగెనక్కల్ దగ్గర నదిలో కలుస్తాయి ఈ వాటర్ ఫాల్స్. కర్ణాటకలోని బ్రహ్మగిరి కొండలలో తలకావేరి వద్ద జన్మించిన కావేరీ నది తూర్పు దిక్కుగా ప్రవహిస్తుంది. కొండ వాలులో ప్రవాహ వేగం పెరిగి పిల్ల కాలువలతో కలిసి వడివడిగా ముందుకు సాగుతుంది. హొగెనక్కల్ చేరేసరికి కావేరీ నది చాలా విశాలంగా తయారై కొండ చరియల మీదు గా కిందికి జారుతూ.. జలపాతాల సమూహంగా కొండలపైనుంచి జాలువారుతూ ఆకట్టుకుంటాయి. ఒకే కొండ రెండుగా మధ్యకు నిలువునా చీలి రెండు కొండలను తలపిస్తుంది.

CORPORATE OFFICE:SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267,HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070.TG. CELL. 9348313999/8885727777.

Edited, Printed, Published & Owned By GURRAM PAPI REDDY,# H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamal Municipality, Ranga reddy District.501511. Telangana. Printedat:GARUDA PRINT- ERS,# H.No.2-86/1, PlotNo.23-SP, SyNo.417, Sagar Highway, Rangannaguda Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District.501510.Telangana.Published at: # H.No.4-57, Thorrur Village,Abdullapurmet Mandal, TurkayamalMunicipality, Ranga reddy District. 501511. Telangana...www.arunaprabha.com..email.arunaprabhadaily@gmail.com, RNI NO. TELTEL/2023/89778, Cell No. 9700127889